వివేకరులు కావలెను

పెన్ సత్తా తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాప్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.

ఫోన్ నెం : 9885315759

RNI:APTEL/2023/87729

పెన్ సత్తా

ప్రశ్నించడం అందిరి హక్కు..

PEN SATTA Telugu Daily



సంపుటి : 4 | సంచిక :168 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | మంగళవారం 3 నవంబర్ 2026 | పేజీలు : 08 | వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool



దీపావళికి గ్రీన్ క్రాకర్స్‌కు
సుప్రీంకోర్టు ఓకే!

- నవంబర్ 7, 8 తేదీల్లోనే అనుమతి.. రోజుకు రెండు గంటలు మాత్రమే
- ఉదయం 6-7 గంటలు.. రాత్రి 8-10 గంటల వరకు అవకాశం
- ఆస్పత్రులు, విద్యాసంస్థల పరిసరాల్లో 300 మీటర్ల వరకు నిషేధం
- నవంబర్ 9 నుంచి మళ్లీ పూర్తి స్థాయి నిషేధం



భారత వైమానిక దళానికి
కొత్త అధిపతి

- 29వ చీఫ్‌గా అశుతోష్ దీక్షిత్
- ఎయిర్ చీఫ్ మార్షల్‌గా బాధ్యతల స్వీకరణ
- ఏపీ సింగ్ స్థానంలో నియామకం
- నాలుగు దశాబ్దాల సైనిక సేవ.. 3,300 గంటలకు పైగా విమానయాన అనుభవం
- ఆపరేషన్ సింధూర్‌లోనూ కీలక బాధ్యతలు

ప్రతి మండలంలో కూటమి జెండాలు రెపరెపలాడాలి

జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలపై చంద్రబాబు దిశానిర్దేశం

రాష్ట్రంలోని 28 జిల్లా పరిషత్ స్థానాలనూ కైవసం చేసుకోవాలని లక్ష్య నిర్దేశం

కూటమి పార్టీల నేతలు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచన

పట్టణ స్థానిక ఎన్నికల కౌంటింగ్‌లో అప్రమత్తంగా ఉండాలని దిశానిర్దేశం

తుఫాన్ల సమయంలోనూ ఎన్నికలు, పాలనపై ఏకకాలంలో దృష్టి సారించామన్న సీఎం



అమరావతి

రాష్ట్రంలోని ప్రతి మండలంలోనూ తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి జెండాలు రెపరెపలాడాలని, ఆ దిశగా ఎంపీటీసీ స్థానాల్లో పైచేయి సాధించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా కూటమి పార్టీల ముఖ్యనేతలతో ఆయన సోమవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి నాదెండ్ల మనోహర్, బీజేపీ ఏపీ అధ్యక్షుడు మాధవ్‌తో పాటు పలువురు ముఖ్య నేతలు పాల్గొన్నారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై, పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల కౌంటింగ్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు అత్యంత కీలకమని చంద్రబాబు నొక్కిచెప్పారు. రాష్ట్రంలోని 28 జిల్లా పరిషత్ ఛైర్మన్ స్థానాలనూ కూటమి పార్టీలే కైవసం చేసుకోవాలని, అందుకు అనుగుణంగా జెడ్పీటీసీ స్థానాలను గెలుచుకోవాలని లక్ష్యం నిర్దేశించారు. కేంద్రం, రాష్ట్రంతో పాటు స్థానికంగానూ ఎన్డీఏ ప్రభుత్వమే ఉంటే అభివృద్ధి పరుగులు పెడుతుందని ఆయన అన్నారు. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షల కోట్ల విలువైన అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, ప్రతి ఇంటికీ సంక్షేమం వివరాలు 2లో..



రోడ్డు పనుల్లో పెను విషాదం..

- విద్యుదాఘాతంతో 8 మంది కార్మికులు మృతి!
- 11 వేల వోల్టుల విద్యుత్ తీగలకు తగిలిన నిర్మాణ యంత్రం
- రాజస్థాన్‌లోని ఝుంఝునూ జిల్లాలో ఘోర ప్రమాదం
- మరో ముగ్గురికి తీవ్ర గాయాలు.. పరిస్థితి విషమం
- బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని సీఎం భరోసా
- ఘటనపై సమగ్ర విచారణకు ఆదేశాలు

ఏపీ పుర పోరు: ముగిసిన రీపోలింగ్

- రేపు ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధం
- ఏపీలోని 13 పోలింగ్ కేంద్రాల్లో ప్రశాంతంగా ముగిసిన రీపోలింగ్
- రేపు (మంగళవారం) ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభం
- రాష్ట్రవ్యాప్తంగా 138 కేంద్రాల్లో కౌంటింగ్‌కు కట్టుదిట్టమైన ఏర్పాట్లు
- టీడీపీ కూటమి, వైసీపీకి అత్యంత కీలకంగా మారిన పుర ఎన్నికల ఫలితాలు



అమరావతి

ఆంధ్రప్రదేశ్‌లో ఉత్కంఠ రేపిన పట్టణ స్థానిక సంస్థల (ఖూదీ) ఎన్నికల ప్రక్రియ తుది అంకానికి చేరుకుంది. నవంబర్ 1న జరిగిన ప్రధాన పోలింగ్‌లో వివాదాలు తలెత్తిన 13 పోలింగ్ కేంద్రాల్లో సోమవారం నిర్వహించిన రీపోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. దీంతో రాష్ట్ర ఎన్నికల సంఘం ఇప్పుడు ఓట్ల లెక్కింపుపై పూర్తి దృష్టి సారించింది. మంగళవారం ఉదయం 8 గంటల నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభం కానుంది. నవంబర్ 1న వివరాలు 2లో..

బీజేపీ ప్రచారం బూమరాంగ్.. దిల్లీలో యథావిధిగా మార్కెట్లు!



- ఇండియా కూటమి ర్యాలీతో వ్యాపారాలకు నష్టం లేదన్న కాంగ్రెస్
- దుకాణాలు తెరిచే ఉన్నాయి.. కొనసాగిన కొనుగోళ్లు
- బీజేపీ తప్పుడు ప్రచారాన్ని ప్రజలు తిప్పికొట్టారు: జైరాం రమేశ్
- స్థానిక వ్యాపారులకు అండగా నిలవాలని రాహుల్ పిలుపు

ఏపీ రెండు రకాల వైపరీత్యాలతో సతమతమవుతోంది



- తక్షణమే సాయం అందించండి
- కేంద్రబృందంతో చంద్రబాబు
- అర్నబ్ తుపాను నష్టం అంచనా వేసేందుకు ఏపీలో పర్యటిస్తున్న కేంద్రబృందం
- కేంద్రబృందంతో సమావేశమైన సీఎం చంద్రబాబు
- అర్నబ్ తుపాను వల్ల ప్రాథమికంగా రూ.4,526 కోట్ల నష్టం వాటిల్లినట్టు చంద్రబాబు వెల్లడి
- రాష్ట్రానికి త్వరితగతిన సాయం అందించాలని కేంద్ర బృందానికి సీఎం విజ్ఞప్తి

అమరావతి

అర్నబ్ తుపాను కారణంగా రాష్ట్రానికి ప్రాథమిక అంచనాల ప్రకారం రూ.4,526 కోట్ల మేర నష్టం వాటిల్లిందని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. తుపాను నష్టాన్ని అంచనా వేసేందుకు రాష్ట్రంలో పర్యటిస్తున్న కేంద్ర బృందంతో సోమవారం ఆయన సమావేశమై పరిస్థితిని వివరించారు. ఈ కష్టకాలంలో కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి రాష్ట్రాన్ని ఆదుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. తుపాను సమాచారం అందిన వెంటనే స్పందించి, నష్టాన్ని అంచనా వివరాలు 2లో..



ఎస్ఐఆర్ దెబ్బ..

ఐదు రాష్ట్రాల్లో 2.28 కోట్ల ఓట్లు మాయం!

- ఓటరు జాబితాల సవరణతో భారీగా తగ్గిన ఓటర్ల సంఖ్య
- ఐదు రాష్ట్రాల్లో 18.71 కోట్ల నుంచి 16.43 కోట్లకు తగ్గుదల
- ఉత్తరప్రదేశ్‌లోనే 2.04 కోట్ల ఓటర్లకు కోత
- అర్హులైన వారికి మరో అవకాశం కల్పిస్తామన్న ఈసీ

రాప్తాడు బాలికపై దాడి..
ప్రభుత్వ వైఫల్యమే కారణం



- బెంగళూరులో బాధితురాలికి పరామర్శ
- వైద్యులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిపై ఆరా
- బాలిక కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్
- వైద్యం ఖర్చులన్నీ ప్రభుత్వమే భరించాలి
- గంజాయి, మద్యం విక్రయాలపై నియంత్రణ ఏదని ప్రశ్న

బెంగళూరు

అనంతపురం జిల్లా రాప్తాడులో పాఠశాల బాలికపై జరిగిన దాడి ఘటనపై వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పందించారు. రాష్ట్రంలో మత్తుపదార్థాల వినియోగం, గంజాయి విక్రయాలు పెరిగిపోవడం వల్లే ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే పాఠశాలల్లోనూ విద్యార్థినులకు రక్షణ లేకుండా పోతోందని విమర్శించారు. బెంగళూరులోని మణిపాల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధిత బాలికను జగన్ పరామర్శించి, ఆమె ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. వైద్యులతో ఆరోగ్య పరిస్థితిపై ఆరా: రాప్తాడులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఓ వ్యక్తి రంపంతో దాడి వివరాలు 2లో..

రాప్తాడు బాలికపై దాడి.. ప్రభుత్వ వైఫల్యమే కారణం

-మొదటిపేజీ తరువాయి

చేయడంతో తీవ్రంగా గాయపడిన బాలిక ప్రస్తుతం బెంగళూరులోని మణిపాల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఆస్పత్రికి వెళ్లిన జగన్ వైద్యులతో మాట్లాడి బాలికకు అందిస్తున్న చికిత్స వివరాలను తెలుసుకున్నారు. ఆమె ఆరోగ్య పరిస్థితి, కోలుకునే అవకాశాలపై ఆరా తీశారు. అనంతరం బాధితురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. మత్తుపదార్థాల నియంత్రణలో ప్రభుత్వం విఫలమైందని విమర్శ: ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ.. రంపం వంటి ప్రమాదకరమైన ఆయుధంతో ఓ వ్యక్తి పాఠశాలలోకి ప్రవేశించి బాలికలపై దాడి చేయడం ఆందోళనకరమన్నారు. పాఠశాలల్లో విద్యార్థుల భద్రతకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారని ప్రశ్నించారు. గ్రామాలు, వీధుల్లో గంజాయి, అక్రమ మద్యం విక్రయాలు విస్తరించాయని ఆరోపించారు. మత్తుపదార్థాలు యువతకు, పిల్లలకు సులభంగా అందుబాటులోకి వస్తున్నాయని విమర్శించారు. వీటిని అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైందని, పాఠశాలల్లోకి బయటి వ్యక్తులు ప్రవేశించకుండా భద్రతా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి రూ.50 లక్షలు ఇవ్వాలి:



బాలిక కుటుంబానికి కూటమి ప్రభుత్వం రూ.50 లక్షల ఆర్థిక సాయం అందించాలని జగన్ డిమాండ్ చేశారు. బాధితురాలి వైద్య ఖర్చులన్నింటినీ ప్రభుత్వమే భరించాలని కోరారు. ప్రభుత్వం నుంచి అవసరమైన సహాయం అందకపోతే వైఎస్సార్‌సీపీ తరఫున వైద్య సహాయం అందిస్తామని, కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం ప్రభుత్వ పరిహారం అందించకపోయినా, వైఎస్సార్‌సీపీ తిరిగి అధికారంలోకి వస్తే బాధిత కుటుంబానికి రూ.50 లక్షలు అందిస్తామని చెప్పారు.

రాజకీయ కక్ష సాధింపు వల్లే ఘటనలంటూ ఆరోపణ:

బాధిత బాలిక చిన్నాన్న వైఎస్సార్‌సీపీకి చెందిన వ్యక్తి, మండల కన్వీనర్‌గా ఉన్నారని జగన్ పేర్కొన్నారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలవుతోందని ఆరోపిస్తూ, గత 15--16 నెలల్లో ఇలాంటి ఘటనలు తొమ్మిది చోటుచేసుకున్నాయని వ్యాఖ్యానించారు. గ్రామాల్లో మద్యం, గంజాయి విక్రయాలను నియంత్రించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. అయితే ఈ ఆరోపణలపై ప్రభుత్వ స్పందనను కథనంలో చేర్చాల్సి ఉంది.

బాలిక కోలుకుంటుందని వైద్యుల భరోసా:

బాధితురాలి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులు సానుకూలంగా స్పందించారని జగన్ తెలిపారు. దేవుడి దయతో బాలిక త్వరగా కోలుకుంటుందని వైద్యులు చెప్పడం కొంత ఊరటనిచ్చిందని పేర్కొన్నారు. బాలికకు మెరుగైన వైద్యం అందించాలని, కుటుంబానికి అవసరమైన సహాయాన్ని అందించాలని మరోసారి ప్రభుత్వాన్ని కోరారు.

బ్యాలెట్ బాక్సుల్లో నిక్షిప్తమైన ఓటరు తీర్పు-
వైఎస్ఆర్‌సీపీకి ఫలితాలు కీలకం

విజయవాడ : ఆంధ్రప్రదేశ్‌లోని పట్టణ స్థానిక సంస్థలు, కార్పొరేషన్ ఎన్నికల పోలింగ్ పర్వం ముగిసింది. మున్సిపల్ పరిధిలోని పౌరులు తమ ఓటు హక్కును వినియోగించుకోవడంతో ప్రధాన అభ్యర్థుల భవితవ్యం బ్యాలెట్ బాక్సుల్లో భద్రమైంది. క్షేత్రస్థాయి నుంచి అందుతున్న సమాచారం , పోలింగ్ సరళిని విశ్లేషిస్తే.. ఎన్నికల సమరం దాదాపు ఏకపక్షంగానే సాగిందనే అభిప్రాయం రాజకీయ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది. అధికార ఎన్డీయే కూటమి సమన్వయంతో, అత్యంత ఉత్సాహంగా ఓటర్లను పోలింగ్ బూతులకు తరలించగలిగితే, వైఎస్సార్‌సీపీ శ్రేణులు మాత్రం మొదటి నుంచి ఆ స్థాయి వ్యూహాత్మక ఉత్సాహాన్ని ప్రదర్శించలేకపోయాయని భావిస్తున్నారు.వాస్తవానికి ఈ పురపాలక సమరంలో పోటీకి దిగడంపై వైఎస్సార్‌సీపీ కేడర్‌లో ప్రాథమికంగా కొంత సందేహాలు నిలిచాయి. ఓటమి చవిచూసిన తర్వాత ఏర్పడిన నిరాశ, ఆర్థిక , లీగల్ ఒత్తిళ్ల కారణంగా పోటీకి దిగేందుకు స్థానిక నేతలు వెనుకాడారు. అయితే, పార్టీ ఉనికిని చాటుకోవడానికీ, కేడర్ చేజారకుండా చూడటానికి ఎన్నికల బరిలో నిలవాల్సిందేనని అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడంతో తప్పనిసరి పరిస్థితుల్లో పోటీలో నిలిచారు. పోటీపడినప్పటికీ గెలుపును నిర్దేశించే ఎలక్షన్ మేనేజ్‌మెంట్ , నిధుల సమీకరణ , ముమ్మర ప్రచారంలో అధికార కూటమిని ఢీకొట్టే స్థాయిలో వైసీపీ సీరియస్‌గా దృష్టి సారించలేకపోయిందనే అభిప్రాయం వినిపిస్తోంది. స్థానిక నాయకత్వంపై రకరకాల ఒత్తిళ్లు ఉండటం, అనేక ప్రాంతాల్లో నామినేషన్ల ఘట్టం నుంచి ప్రచారం దాకా అనుకున్న స్థాయిలో సహకారం



లభించకపోవడం వల్ల ఈ పుర ఎన్నికల్లో వైసీపీకి ప్రతికూల ఫలితాలు వస్తాయనే అంచనాలు వెలువడుతున్నాయి. అయితే, రాయలసీమలోని కొన్ని కంచుకోటలు, కడప, పులివెందుల, ఉమ్మడి ఉమ్మడి జిల్లాలలోని సొంత సీట్లతో పాటు పట్టణాల్లోని పేద వర్గాల ఓటు బ్యాంక్ తమను గట్టెక్కిస్తుందని వైఎస్సార్‌సీపీ ఆశాభావంతో ఉంది. కనీస స్థాయిలో స్థానాలు సాధించినా సరే, పార్టీ ఇమేజ్ నిలబడుతుందని అధిష్ఠానం ధీమాగా ఉంటే.. పరాజయం ఎదురైతే కేడర్ మానసిక స్థితి మరింత దిగజారే ప్రమాదం ఉంది.ఈ పురపాలక ఫలితాలు కేవలం మున్సిపాలిటీలు లేదా కార్పొరేషన్ల అధికార పీఠాలకే పరిమితం కాకుండా, ఇరు పార్టీల శ్రేణుల మానసిక దృక్పథం పై తీవ్ర ప్రభావాన్ని చూపనున్నాయి. అసెంబ్లీ ఎన్నికల పరాజయం తర్వాత కోలుకోవడానికి ప్రయత్నిస్తున్న వైసీపీకి ఈ ఫలితాలు ఒక పరీక్ష లాంటివి. ఒకవేళ ఊహించని విధంగా వైసీపీ ఓ మాదిరి ఫలితాలను సాధించగలిగితే.. "పార్టీకి ఇంకా క్షేత్రస్థాయిలో పట్టు ఉంది, ప్రజాదరణ తగ్గలేదు అనే సందేశం ప్రజల్లోకి వెళ్లి, నాయకుల్లో సరికొత్త ఉత్సాహం నిండుతుంది. క్లిష్ట సమయం నుంచి కోలుకోవడానికి ఆ పార్టీకి ఇవి సంజీవనిలా ఉపయోగపడతాయి.మరోవైపు, అధికారంలోకి వచ్చాక సాధిస్తున్న ఈ విజయాల ఊపును కొనసాగించాలని ఎన్డీయే కూటమి ఉవ్విళ్లూరుతోంది. పట్టణ ప్రాంత ఓటర్లు ఎప్పుడూ అభివృద్ధి, మౌలిక సదుపాయాల వైపే మొగ్గు చూపుతారని, ప్రభుత్వం ప్రవేశపెట్టిన కార్యక్రమాలు తమకే విజయాన్ని అందిస్తాయని కూటమి నేతలు చెప్తున్నారు. నవంబర్ 3న వెలువడబోయే ఓట్ల లెక్కింపు ఫలితాలు వైఎస్సార్‌సీపీ భవిష్యత్ కార్యాచరణకు అత్యంత ప్రాధాన్యమైన దిక్సూచిగా మారనున్నాయి. ఈ ఫలితాలు వైసీపీని మళ్లీ పుంజుకునేలా ఉత్సాహపరుస్తాయా లేక అధికార కూటమికి తిరుగులేని ఆధిక్యాన్ని ఇచ్చి ప్రతిపక్షాన్ని మరింత ఇరకాటంలో పడేస్తాయా అనేది మరో రోజులో స్పష్టం కానుంది.

బాల ఉన్మాదులను.. దారిలో పెట్టేది ఎవరు?

అనంతపురం : పాఠశాల అంటే.. చదువులకు చిరునామా.. పిల్లల మాటలు.. ఆటలు.. పాటలు వంటి వాటితో విలసిల్లే పవిత్రమైన ప్రాంతం. అటువంటి పాఠశాలలు దారుణాలకు కేంద్రమవుతున్నాయి. విద్యార్థులు చదువుకోవాల్సిన చోట నెత్తుటి మరకలు కనిపిస్తున్నాయి. అమాయకమైన పిల్లలపై తోటి విద్యార్థులు దారుణమైన దాడులకు దిగుతుండడం కలవరపాటుకు గురిచేస్తోంది. హర్యాన రాష్ట్రంలో పంచకుల ప్రాంతంలో తాజాగా జరిగిన ఘటన మన విద్యా వ్యవస్థలో ఉన్న లోపాన్ని.. పిల్లల ఆలోచన తీరును ఎత్తిచూపుతోంది. హర్యానా రాష్ట్రంలోని పంచకుల ప్రాంతంలో సెక్టార్ 20 లో సంస్కృతి మోడల్ స్కూల్ ఉంది. ఈ పాఠశాలలో జరిగిన సంఘటన(గ్రాఫ్)ంతికి గురిచేస్తుంది. ఇక్కడ కేజీ చదువుతున్న ఒక చిన్నారిపై.. ఇదే పాఠశాలలో మూడవ తరగతి చదువుతున్న ఒక బాలుడు ఇటుకరాలతో దారుణంగా దాడి చేశాడు. బాలుడు చేసిన దాడుల వల్ల ఆ పాప స్పృహ కోల్పోయింది. ఆ పాపను ప్రస్తుతం ఒక ఆసుపత్రికి తరలించారు. అతడు చేసిన దాటికి సంబంధించిన దృశ్యాలు సిసి కెమెరాల ద్వారా బయటికి రావడంతో.. వాస్తవం ఏంటనేది తేలింది.ఇక రాప్తాడులో పదవ తరగతి చదివే విద్యార్థిని మీద.. ఒక యువకుడు తరగతి గదిలో అందరూ చూస్తుండగానే రంపం తో దాడి చేశాడు. ఈ దాడిలో ఆ బాలిక చెయ్యి తెగిపోయింది. ముఖం మీద తీవ్రంగా గాయాలయ్యాయి. ప్రస్తుతం ఆ బాలిక పరిస్థితి విషమంగా ఉంది. ప్రేమకు నిరాకరించడం వ ల్లే అతడు ఈ స్థాయిలో దారికి పాల్పడినట్లు తెలుస్తోంది.ఇక నల్గొండ జిల్లాలో స్కూల్ ప్రిన్సిపాల్ ను అదే పాఠశాలలో చదివే విద్యార్థులు అత్యంత దారుణంగా చంపేశారు. ఆమె దగ్గర ఉన్న డబ్బులను దొంగిలించారు. ఈ ఘటన తెలంగాణ రాష్ట్రంలో సంచలనం కలిగించింది.వాస్తవానికి చిన్న పిల్లలు ఇలా మారిపోవడానికి కారణాలు అనేకం ఉన్నాయి అంటున్నారు సైకాలజిస్టులు. ఈ విపరీత ధోరణికి అడ్డుగడ్డ వేయాలంటే పోలీసు కేసులు మాత్రమే సరిపోవని చెబుతున్నారు. తల్లిదండ్రులు.. పాఠశాలలో ఉన్న ఉపాధ్యాయులు ఉమ్మడిగా బాధ్యత తీసుకోవాలని చెబుతున్నారు. తల్లిదండ్రులు పిల్లలతో ప్రతిరోజు సమయం కేటాయించాలని.. వారితో మాట్లాడాలని.. వారి మాట తీరును పరిశీలించాలని.. పాఠశాలలో వారికి ఎదురైనా అనుభవాలు.. స్నేహితుల గురించి తెలుసుకోవాలని సూచిస్తున్నారు. పిల్లలకు మొబైల్ ఫోన్ ఇచ్చేటప్పుడు.. వారు చూస్తున్న కంటెంట్.. ఆడుతున్న



గేమ్ లపై నిరంతరం పర్యవేక్షించాలని చెబుతున్నారు. హింసాత్మకమైన ఆటలకు దూరంగా ఉండే విధంగా చేయాలని. ఇంట్లో ఏమాత్రం గొడవలు లేకుండా ప్రశాంతమైన వాతావరణం అందించాలని.. కోపాన్ని కాకుండా.. ప్రేమతో వారిని దగ్గర తీసుకోవాలని చెబుతున్నారు.. పాఠశాలల్లో కూడా సైకాలజిస్టులను నియమించుకోవాలని.. వారితో ఎప్పటికప్పుడు కౌన్సిలింగ్ అందించాలని మనస్తత్వ నిపుణులు చెబుతున్నారు. మార్కులు.. ర్యాంకులు కాకుండా.. మానవీయకోణం.. ఇతరులను గౌరవించడం.. తోటి వారి మీద దయ కలిగి ఉండే వాటి లక్షణాలను పెంపొందించాలని సూచిస్తున్నారు.

హేమంత్ ఎన్ కౌంటర్

అనంతపురం జిల్లా రాప్తాడు ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి చదివే బాలిక మీద హేమంత్ అనే దుర్మార్గుడు తరగతి గదిలో చెట్లు కోసే రంపం తో దాడి చేశాడు. ఈ ఘటనలో ఆ బాలిక తీవ్రంగా గాయపడింది. అతడు రంపంతో కోయడంతో ఒక చేయి విరిగింది. ముఖం మీద.. అనేక ప్రాంతాలలో తీవ్రంగా గాయాలయ్యాయి. రక్త స్రావం కూడా అధికంగా జరిగింది.మొదట్లో స్థానికంగా చికిత్స అందించినప్పటికీ.. అత్యవసర వైద్యం అందించాల్సి రావడంతో ఆ బాలికను బెంగళూరు తరలించారు. గ్రీన్ ఛానల్ ఏర్పాటు చేసి మణి పాల్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు దాదాపు 12 గంటల పాటు శ్రమించి ఆమెకు శస్త్ర చికిత్సలు నిర్వహించారు. ఆసుపత్రి వైద్యులతో ఏపీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఏప్పటికప్పుడు మాట్లాడారు. బాలికకు అందుతున్న వైద్యం గురించి సంప్రదింపులు జరిపారు. ఆదివారం మధ్యాహ్నం బాధిత బాలికను నారా లోకేష్ పరామర్శించారు. బాధిత బాలిక కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.ఈ దారుణానికి పాల్పడిన హేమంత్ శనివారమే పోలీసులకు చిక్కాడని వార్తలు వచ్చాయి. అయితే ఆదివారం సాయంత్రం దాటిన తర్వాత ఆ దుర్మార్గుడికి సంబంధించిన వార్తలు మీడియాలో విస్తృతంగా సర్కులేట్ అయ్యాయి. హేమంత్ ఆత్మకూరు అటవీ ప్రాంతంలో ఉన్నాడని.. పోలీసులు అతడిని పట్టుకునే క్రమంలో ఎదురు తిరిగాడని.. ఈ నేపథ్యంలో పోలీసులు అతని మీద కాల్పులు జరిపారని తెలుస్తోంది. దాదాపు 6 రౌండ్ల పాటు అతని మీద కాల్పులు జరిపారని సమాచారం. పోలీసుల కాల్పుల వల్ల హేమంత్ తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని ఆసుపత్రికి తరలించారని ప్రచారం జరుగుతోంది.ఈ ఘటన జరిగిన తర్వాత హేమంత్ ను ఎన్కౌంటర్ చేయాలని ప్రజల నుంచి డిమాండ్లు వ్యక్తం అయ్యాయి. నిన్న ఘటన జరిగిన దగ్గర నుంచి ఇవాల్టి వరకు కూడా సోషల్ మీడియాలో ఇదే చర్చ నడుస్తోంది. అటువంటి వ్యక్తులకు బతికే అవకాశం లేదని.. సమాజంలో మృగాల కంటే హీనంగా వ్యవహరిస్తున్న హేమంత్ లాంటి వ్యక్తులు బతకకూడదని.. సోషల్ మీడియాలో నెటిజన్లు డిమాండ్ చేశారు. అయితే ప్రస్తుతం ప్రభుత్వం ఫోకస్ మొత్తం ఆ బాలికను ప్రాణాపాయం నుంచి బయటికి తీసుకొచ్చే దానిమీద మాత్రమే ఉంది. అయితే పోలీసు వ్యవస్థ హేమంత్ విషయంలో ఒక నిర్ణయానికి వచ్చిందని తెలుస్తోంది.

చిన్నారికి సర్జరీ.. విద్యార్థులకు కౌన్సెలింగ్

మరోవైపు, ఈ ఘటనతో తీవ్ర భయాందోళనకు గురైన తోటి విద్యార్థుల్లో మానసిక ధైర్యం నింపేందుకు లోకేశ్ ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇందుకోసం 20 మంది కౌన్సెలర్లతో ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. ఈ బృందం, ఘటన జరిగిన పదో తరగతి 'ఏ' సెక్షన్‌లోని 32 మంది విద్యార్థుల ఇళ్లకు వెళ్లి వారితో, వారి తల్లిదండ్రులతో మాట్లాడుతోంది. అదేవిధంగా 8, 9, 10 తరగతులకు చెందిన ఇతర విద్యార్థినులకు కూడా కౌన్సెలింగ్ అందించనున్నారు.ఈ చర్యల ద్వారా విద్యార్థుల్లో భయాన్ని పోగొట్టి, తిరిగి ఆత్మవిశ్వాసంతో పాఠశాలకు హాజరయ్యేలా చూడటమే లక్ష్యమని విద్యాశాఖ అధికారులు తెలిపారు. విద్యార్థులు ఎలాంటి ఆందోళన లేకుండా చదువుపై దృష్టి సారించేలా అవసరమైన సహాయాన్ని కొనసాగించనున్నట్లు స్పష్టం చేశారు.

ఏపీ పుర పోరు: ముగిసిన రీపోలింగ్..

-మొదటిపేజీ తరువాయి

పోలింగ్ సందర్భంగా బూత్ కబ్జా, రిగ్గింగ్ వంటి ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠ 13 కేంద్రాల్లో రీపోలింగ్‌కు ఆదేశించిన విషయం తెలిసిందే. దీని ప్రకారం, అనంతపురం, తిరుపతి, వైఎస్సార్ కడప, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లోని ఏడు పట్టణ స్థానిక సంస్థల పరిధిలో ఉన్న 12 వార్డులలో ఈ రీపోలింగ్ జరిగింది. సోమవారం ఉదయం 7 గంటలకు ప్రారంభమైన ఈ ప్రక్రియ సాయంత్రం 5 గంటలకు ముగిసింది. క్యూలో ఉన్నవారికి ఓటు వేసే అవకాశం కల్పించడంతో పోలింగ్ ప్రశాంతంగా పూర్తయింది. ముఖ్యంగా వైఎస్సార్ కడప జిల్లాలోని పులివెందుల, జమ్మలమడుగు, పల్నాడు జిల్లాలోని మాచర్ల వంటి కీలక ప్రాంతాల్లో రీపోలింగ్ జరగడం గమనార్హం.

కౌంటింగ్‌కు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

రీపోలింగ్ ముగియడంతో అందరి దృష్టి ఇప్పుడు ఫలితాలపై నిలిచింది. మంగళవారం ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 13 నగరపాలక సంస్థల కోసం 22, మిగిలిన మున్సిపాలిటీలు, నగర పంచాయతీల కోసం 116 కలిపి మొత్తం 138 కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల్లో 556 కౌంటింగ్ హాళ్లు, 6,831 టేబుళ్లు సిద్ధం చేశారు. ప్రతి టేబుల్‌కు ఒక సూపర్‌వైజర్, ఇద్దరు సహాయకులతో పాటు భారీగా సిబ్బందిని నియమించారు. ముందుగా పోస్టల్ బ్యాలెట్లను లెక్కించి, ఆ తర్వాత బ్యాలెట్ బాక్సుల్లోని ఓట్లను లెక్కిస్తారు. కౌంటింగ్ కేంద్రాల పద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సీసీటీవీ కెమెరాలతో కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. గుర్తింపు కార్డులు ఉన్న ఏజెంట్లను మాత్రమే లోపలికి అనుమతించనున్నారు.

కూటమి, వైసీపీకి ప్రతిష్ఠాత్మకం

రాష్ట్రంలో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలిసారిగా జరుగుతున్న స్థానిక ఎన్నికలు కావడంతో ఈ పుర ఫలితాలు అధికార, విపక్షాలకు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా మారాయి. 92 పట్టణ స్థానిక సంస్థలకు జరిగిన ఈ ఎన్నికల్లో నవంబర్ 1న సుమారు 60.96% పోలింగ్ నమోదైంది. 13 మేయర్, 70 మున్సిపల్ చైర్‌పర్సన్ పదవులతో పాటు, కార్పొరేషన్లలో 804 డివిజన్లు, మున్సిపాలిటీలలో 2,382 వార్డుల భవిష్యత్తు రేపటి కౌంటింగ్‌తో తేలనుంది. ఈ ఫలితాలు రాష్ట్ర రాజకీయాలపై ఎలాంటి ప్రభావం చూపుతాయోనని సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

ఏపీ రెండు రకాల వైపరీత్యాలతో సతమతమవుతోంది

-మొదటిపేజీ తరువాయి

వేయడానికి వచ్చిన కేంద్ర బృందానికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "రియల్ టైమ్ గవర్నెన్స్ (ఆర్టీజీ), ఆధునిక టెక్నాలజీని సమర్థంగా ఉపయోగించుకోవడం వల్లే ప్రాణనష్టాన్ని గణనీయంగా తగ్గించగలిగాం. తుపాను నష్టంపై ప్రాథమిక నివేదికను వెంటనే కేంద్రానికి పంపించాం" అని తెలిపారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ఒక విచిత్రమైన పరిస్థితిని ఎదుర్కొంటోందని, ఒకవైపు రాయలసీమలో ఎల్ నినో వంటి తీవ్ర కరవు పరిస్థితులు నెలకొంటే, మరోవైపు కోస్తా ప్రాంతం వరుస తుపానులతో అతలాకుతలమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అర్నబ్ తుపాను మిగిల్చిన నష్టం నుంచి కోలుకోకముందే 'మురసు' రూపంలో మరో తుపాను ముప్పు పొంచి ఉందని గుర్తుచేశారు. తుపాను ప్రభావంతో వ్యవసాయ, ఉద్యాన పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని సీఎం వివరించారు. ముఖ్యంగా కొబ్బరి, అరటి తోటలు పూర్తిగా నేలమట్టమయ్యాయని తెలిపారు. కరవును తట్టుకునేందుకు రాయలసీమ రైతులను ఉద్యాన పంటల వైపు ప్రోత్సహిస్తుంటే, ఇప్పుడు ఆ పంటలు కూడా తుపానుల బారిన పడటం ఆందోళన కలిగిస్తోందన్నారు. ఆక్వా కల్చర్ రంగానికి కూడా భారీ నష్టం వాటిల్లిందని, మత్స్యకారుల పడవలు ధ్వంసమయ్యాయని పేర్కొన్నారు. విద్యుత్, రహదారులు వంటి మౌలిక సదుపాయాలు తీవ్రంగా దెబ్బతిన్నాయని తెలిపారు. గతంలో హుద్ హుద్, తిత్లీ, మొంథా వంటి తుపానులు కూడా రాష్ట్రాన్ని ఆర్థికంగా దెబ్బతీశాయని ప్రస్తావించారు. ప్రస్తుతం 7 వేల మంది సిబ్బందితో విద్యుత్ పునరుద్ధరణ పనులను యుద్ధప్రాతిపదికన చేపడుతున్నామని, సహాయక చర్యలను ఆర్టీజీఎస్ ద్వారానే పర్యవేక్షిస్తున్నామని సీఎం వివరించారు. కేంద్ర బృందం త్వరితగతిన తమ సిఫార్సులను కేంద్రానికి అందించి, రాష్ట్రానికి నష్టపరిహారం అందేలా చూడాలని కోరారు. కేంద్రం అందించే సత్వర సాయం, ఈ కష్టకాలంలో రాష్ట్రానికి ఎంతో ఊరటనిస్తుందని చంద్రబాబు పేర్కొన్నారు.

ప్రతి మండలంలో కూటమి జెండాలు రెపరెపలాడాలి

-మొదటిపేజీ తరువాయి

అందించామని గుర్తుచేశారు. ప్రజల ఆశలు నెరవేర్చేలా సుపరిపాలన అందిస్తున్నామని, ఈ విషయాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని సూచించారు. ఈ లక్ష్య సాధన కోసం కూటమి పార్టీల నేతలు, కార్యకర్తలు పూర్తి సమన్వయంతో పనిచేయాలని చంద్రబాబు స్పష్టం చేశారు. కూటమి స్ఫూర్తితో అందరూ ఉమ్మడి కార్యాచరణ చేపట్టాలన్నారు. స్థానిక ఎన్నికలపై తాను, పవన్ కల్యాణ్, మాధవ్ నిరంతరం చర్చించుకుంటున్నామని తెలిపారు. ఇటీవల జరిగిన పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో పోలింగ్ శాతం తక్కువగా నమోదైందని, జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో మాత్రం పెద్ద ఎత్తున పోలింగ్ జరిగేలా చూడాలని ఆదేశించారు. కూటమి ఓటర్లందరూ తమ ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతంగా జరగడంపై సంతృప్తి వ్యక్తం చేసిన సీఎం, పులివెందులలో హింస సృష్టించేందుకు కొందరు ప్రయత్నించినా కూటమి నేతలు సంయమనం పాటించారని అభినందించారు. త్వరలో జరగనున్న కౌంటింగ్ ప్రక్రియలోనూ అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఒకవైపు ఎన్నికల హడావుడి ఉన్నప్పటికీ, మరోవైపు 'అర్నబ్', 'మురసు' తుపానుల సహాయక చర్యలను సమర్థంగా చేపడుతున్నామని, విరిగిన స్తంభాలను పునరుద్ధరించి విద్యుత్ సరఫరాను గాడిలో పెట్టామని చంద్రబాబు వివరించారు. ఏపీలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ నవంబరు 5న జరగనుండగా, నవంబరు 7న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు వెల్లడించనున్నారు.

1300 కే ఏపీలో ధరణి రైస్

రాజమండ్రి : దేశవ్యాప్తంగా ఎల్‌నినో ప్రభావంతో బహిరంగ మార్కెట్లో బియ్యంతోపాటు నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరిగాయి. గతంలో ఎప్పుడూలేని విధంగా పలు రకాలకు చెందిన బియ్యం కిలో రూ. 80 నుంచి రూ.100కు చేరింది. దీంతో పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇలాంటి సమయంలో ఏపీ ప్రభుత్వం వారికి శుభవార్త చెప్పింది.భారీగా పెరుగుతున్న బియ్యం, నిత్యావసర వస్తువుల ధరల నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం పేద, మధ్య తరగతి వర్గాలకు ఊరట కలిగించేలా రాయితీపై పలు రకాల వస్తువులను అందిస్తోంది. ఫైన్ రకం బియ్యంతోపాటు.. ఉల్లిపాయతోపాటు ఇతర కూరగాయలను రాయితీపై అందిస్తోంది. అయితే, ఏపీ సర్కార్ మరో కీలక నిర్ణయం తీసుకుంది. పేదలకు ఊరటనిచ్చే విధంగా రూ. 1300లకే ధరణి బ్రాండ్ 26కిలోల సన్నబియ్యం బస్తాను అందుబాటులోకి తీసుకొచ్చింది.రాష్ట్ర వ్యాప్తంగా పథకం అమలులో తిరుపతి జిల్లా కీలక పాత్ర పోషిస్తోంది. జిల్లాలోని రెండు ప్రధాన రైస్ మిల్లుల నుంచి తిరుపతి జిల్లాతోపాటు చిత్తూరు, అన్నమయ్య, అనంతపురం, పుట్టపర్తి, వైఎస్ఆర్ కడప, కర్నూలు, నంద్యాల మొత్తం ఎనిమిది జిల్లాలకు ధరణి బియ్యం బస్తాలను సరఫరా చేస్తున్నారు. ప్రతీరోజూ వేలాది క్వింటాళ్ల బియ్యం రైతుబజార్లు, పంపిణీ కేంద్రాలకు రవాణా అవుతోంది. తక్కువ ధరకు అందిస్తున్న 26కిలోల ధరణి బ్రాండ్ సన్న బియ్యం బస్తాలను అర్హులైన ప్రతీఒక్కరికీ పంపిణీ చేయాలనే లక్ష్యంతో ఆధార్ కార్డుతో అనుసంధానం చేశారు. బస్తాను పొందే వినియోగదారుని పేరు, ఆధార్, ఫోన్ నెంబర్లను నమోదు చేస్తున్నారు.పాస్తా ఎంచుకోండిఇదిలాఉంటే.. ఈ ధరణి బ్రాండ్ బియ్యాన్ని రైతు బజార్లలో మాత్రమే కాకుండా మొబైల్ వాహనాల ద్వారా మున్సిపాలిటీలు, మండల కేంద్రాలకు కూడా విక్రయాలను విస్తరించాలని సీఎం చంద్రబాబు నాయుడు సూచించారు. సూపర్ ఫైన్ రకం బియ్యాన్ని కిలో రూ.49, రూ.50కు విక్రయించాలని అన్నారు. మిగిలిన బియ్యం ధరలపైనా నియంత్రణ ఉండేలా చూడాలని అధికారులకు చంద్రబాబు సూచించారు. మరోవైపు బియ్యం ధరలు అదుపులో ఉండేలా మిల్లర్లు, హోల్‌సేల్ వ్యాపారులతో అధికారులు చర్చిస్తున్నారు. కొన్నిరకాల బియ్యం ధరలను తగ్గించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చే పనిలో ఉన్నారు.

జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణ లో నిబంధనలు ఖచ్చితంగా పాటించాలి.





- మండల స్థాయిలో, జిల్లా పరిషత్ లో కంట్రోల్ రూములను ఏర్పాటు చేయాలి.
- కౌంటింగ్ పూర్తయ్యేవరకు మోడల్ కోడ్ అమలు.
- ప్రతి రెండు గంటలకు పోలింగ్ సరళిపై నివేదిక ఇవ్వాలి.
- పోలింగ్ కు 48 గంటల ముందునుండి మద్యం దుకాణాలు బంద్.
- జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్.

విశాఖపట్నం, పెన్ సత్తా, నవంబర్ 02: జిల్లాలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేసి, ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనలను అతిక్రమించ కుండా జాగ్రత్త వహించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిషోర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరం లో జె. సి జి. విద్యాధరి తో కలిసి ఆర్డీఓలు, రిటర్నింగ్ అధికారులు, ఎంపీడీఓలు, నోడల్ అధికారులతో ఎన్నికల ఏర్పాట్లపై సమీక్షించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 5 న పోలింగ్ ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుందని, ప్రతి పోలింగ్ కేంద్రంలో కనీస సదుపాయాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. క్రిటికల్ పోలింగ్ కేంద్రాల్లో వెబ్కాస్టింగ్, వీడియోగ్రఫీ ఏర్పాటు చేయాలని తెలిపారు. పోలింగ్ స్టేషన్ల వద్ద దారులను చూపుతూ సైనేజెస్ పెట్టాలని, ప్రతి మండలం లో ఒక మాడల్ పోలింగ్ కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేయాలని సూచించారు.

పోలింగ్ సరళిని పర్యవేక్షించడానికి ప్రతి మండల స్థాయి లోనూ, అలాగే జిల్లా పరిషత్ లో కూడా కంట్రోల్ రూములను ఏర్పాటు చేయాలని, కంట్రోల్ రూమ్ లో పూర్తి స్థాయి లో అవసరమగు సిబ్బందిని ఏర్పాటు చేసి వారికి వెంటనే ఉత్తర్వులు జారీ చేయాలని సూచించారు. ప్రతి రెండు గంటలకు ఒకసారి పోలింగ్ సరళికి సంబంధించిన వివరాలను నిర్దేశిత సమయానికి కంట్రోల్ రూమ్‌కు అందించాలని తెలిపారు. తుది పోలింగ్ శాతం తప్పనిసరిగా ఇవ్వాలని తెలిపారు. పోలింగ్ మెటీరీయల్ సక్రమంగా పంపిణీ కావాలని, పబ్లిక్ అడ్రసు సిస్టమ్ లను ఏర్పాటు చేయాలని, స్ట్రాంగ్ రూమ్ వద్ద, పోలింగ్ బూత్ ల వద్ద సక్రమంగా బారికేడింగ్ చేయాలని, పోలింగ్ కు, కౌంటింగ్ కు నియమించిన సిబ్బందికి శిక్షణలు పూర్తి చేయాలని తెలిపారు. బ్యాలెట్ పేపర్లు, స్టేషనరీ, ఇతర ఎన్నికల సామగ్రిని ముందుగానే తనిఖీ చేసి సిద్ధంగా ఉంచాలన్నారు. పంపిణీ కేంద్రాల వద్ద హెల్ప్ డెస్క్ లను ఏర్పాటు చేయాలని తెలిపారు. రిసెప్షన్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ కేంద్రాల్లో అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని, భద్రత, సీసీటీవీ పర్యవేక్షణ ఉండాలని అన్నారు. ఓటర్ స్లిప్పులను శత శాతం ముందుగానే ఇంటింటికీ పంపిణీ చేయాలని తెలిపారు. పోలింగ్ కు 48 గంటల ముందే ప్రచారాన్ని నిలిపివేయాలని తెలిపారు. పోస్టల్ బాలెట్ల పంపిణీ, స్వీకరణ సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. పోలింగ్ సిబ్బందికి ఎన్నికల సామగ్రి పంపిణీ, రూట్ వెరిఫికేషన్, రవాణా ఏర్పాట్లు పక్కాగా చేయాలని, పోలింగ్ సిబ్బందికి చక్కటి వసతి, భోజన సౌకర్యాలు , తాగునీరు, అల్పాహారం ఏర్పాటు చేసి వారి పట్ల మర్యాదగా ప్రవర్తించాలని సూచించారు. ఆర్డీఓలు కౌంటింగ్ కేంద్రాలను తనిఖీ చేయాలని, ఎంపిడిఓలు, పోలీసు అధికారులు సమన్వయంతో పనిచేస్తూ తమ పరిధిలో ఎన్నికల ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షించాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో, కౌంటింగ్ కేంద్రాల్లో, స్ట్రాంగ్ రూమ్ ల వద్ద నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని అన్నారు. పోలింగ్ కు 48 గంటల ముందు నుండి మద్యం దూకణాలను మూసివేయాలని తెలిపారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యానికి, నిబంధనల ఉల్లంఘనకు తావులేకుండా, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రతి అధికారి తమకు అప్పగించిన బాధ్యతలను పూర్తి జవాబుదారీతనంతో నిర్వహించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ సమావేశంలో డిఆర్ఓ విశ్వేశ్వర నాయుడు, ఇద్దరు ఆర్. డి. ఓ లు సందీప్ చక్రవర్తి, సంగీత్ మాధుర్, ఎన్నికల అధికారులు, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

మురసు తుఫాను దృశ్య ప్రజల అప్రమత్తంగా ఉండాలి జిల్లా కలెక్టర్.



అనకాపల్లి, పెన్ సత్తా, నవంబర్ 02 : మురసు తుఫాను దృశ్య ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ ప్రజలకు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భారత వాతావరణ శాఖ (ఐఏండి) తాజా నివేదిక ప్రకారం, బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మురసు తుఫాను గురించి సోషల్ మీడియాలో చాలా వదంతులు ప్రచారంలో ఉన్నాయని, ప్రజలు ఎలాంటి భయభ్రాంతులకు గురికావద్దని కలెక్టర్ కోరారు. జిల్లాలో ఎలాంటి తీవ్ర మైన లేదా మోస్తరు వర్షపాత హెచ్చరికలు లేవని, అక్కడక్కడా తేలికపాటి వర్షం పడే అవకాశం ఉందే తప్ప, ఎక్కడా భారీ వర్షాల హెచ్చరికలు లేవని కలెక్టర్ తెలిపారు. లోతట్టు గ్రామాల ప్రజలు కాస్త అప్రమత్తంగా ఉండాలన్నారు.

వర్షాకాలంలో తీసుకోవాల్సిన సాధారణ ముందస్తు జాగ్రత్తలు (చెట్లు, విద్యుత్ పోల్స్ దగ్గరకు వెళ్లకుండా ఉండటం) పాటించాలని, ప్రజలు ఎవరూ ఆందోళన చెందవద్దని స్పష్టం చేశారు. వాతావరణ శాఖ, జిల్లా యంత్రాంగం ఎప్పటి కప్పుడు జారీ చేసే హెచ్చరికలను గమనిస్తూ పాటించాలని కలెక్టర్ ప్రజలకు పిలుపు నిచ్చారు. ప్రజలు ఎవరూ ఆందోళన చెంద వద్దని, సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మవద్దని, కేవలం అధికారిక సమాచారాన్ని మాత్రమే నమ్మాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

జడ్పిటిసి ఎంపీటీసీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి.

జిల్లా పరిషత్ సీఈవో సత్యనారాయణ.



అనకాపల్లి, పెన్ సత్తా, నవంబర్ 02: జిల్లాలో జడ్పిటిసి ఎంపీటీసీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా పరిషత్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సత్యనారాయణ సోమవారం ఉదయం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జడ్పిటిసి ఎంపిటిసి ఎన్నికలకు సంబంధించి రిసెప్షన్ సెంటర్, స్ట్రాంగ్ రూమ్ సెంటర్, కౌంటింగ్ సెంటర్ తదితర వివరాలను తెలియజేశారు.

అనకాపల్లి, బుచ్చయ్యపేట, కసింకోట, మునగపాక, పరవాడ, సబ్బవరం మండలాలకు సంబంధించి ఏ. ఎం. ఏ. ఎల్. కాలేజ్ , కొత్తూరు విలేజ్, అనకాపల్లి నందు రిసెప్షన్ సెంటర్, స్ట్రాంగ్ రూమ్ సెంటర్, కౌంటింగ్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చోడవరం మండలానికి సంబంధించి గవర్నమెంట్ హై స్కూల్, గంది గ్రామం, చోడవరం మండలం నందు రిసెప్షన్ సెంటర్, స్ట్రాంగ్ రూమ్ సెంటర్, కౌంటింగ్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దేవరపల్లి, కె కోటపాడు మండలాలకు సంబంధించి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులం (బాయ్స్), తెనుగు పూడి దేవరపల్లి మండలం నందు రిసెప్షన్ సెంటర్, స్ట్రాంగ్ రూమ్ సెంటర్, కౌంటింగ్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నక్కపల్లి మండలానికి సంబంధించి గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ నక్కపల్లి నందు, పాయకరావుపేట, ఎస్ రాయవరం మండలాలకు సంబంధించి జిల్లా పరిషత్ హై స్కూల్, నక్కపల్లి నందు రిసెప్షన్ సెంటర్, స్ట్రాంగ్ రూమ్ సెంటర్, కౌంటింగ్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.మాకవరపాలెం, నర్సీపట్నం, రోలుగుంట మండలాలకు సంబంధించి డాన్ బాస్కో స్కూల్, పెద్ద బొడ్డేపల్లి నందు, కోటవురట్ల, గొలుగొండ, నాతవరం, రావికమతం మండలాలకు సంబంధించి గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ నర్సీపట్నం నందు రిసెప్షన్ సెంటర్, స్ట్రాంగ్ రూమ్ సెంటర్, కౌంటింగ్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

వి. మాడుగుల, చీడికాడ మండలాలకు సంబంధించి సెంటెన్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ , విమాడుగుల నందు రిసెప్షన్ సెంటర్, స్ట్రాంగ్ రూమ్ సెంటర్, కౌంటింగ్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

అచ్యుతాపురం, రాంబిల్లి మండలాలకు సంబంధించి ఇండోర్ స్టేడియం యలమంచిలి నందు యలమంచిలి మండలానికి సంబంధించి ఎస్జిఏ గవర్నమెంట్ డిగ్రీ కళాశాల, యలమంచిలి నందురిసెప్షన్ సెంటర్, స్ట్రాంగ్ రూమ్ సెంటర్, కౌంటింగ్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి సత్యనారాయణ తెలిపారు.

నేటితో పరిషత్ ఎన్నికల ప్రచారానికి తెర.

- సాయంత్రం 5:00 గంటల తర్వాత మైకులు, ప్రచారాలు బంద్.
- 48 గంటల నిబంధన ఉల్లంఘిస్తే కఠిన చర్యలు.
- జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి విజయ కృష్ణన్.

అనకాపల్లి, పెన్ సత్తా, నవంబర్ 02: జిల్లాలో నవంబర్ 5 వ తేదీన జరగనున్న జడ్పీటీసీ, ఎంపీటీసీ సాధారణ ఎన్నికల పోలింగ్‌కు సంబంధించి బహిరంగ ప్రచారానికి నవంబర్ 3 వ తేదీ మంగళవారం సాయంత్రం 5:00 గంటలతో తెరపడనుందని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి విజయ కృష్ణన్ తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం పోలింగ్ ముగిసే సమయానికి 48 గంటల ముందు నుంచే ప్రచార గడువు ముగుస్తుందని స్పష్టం చేశారు. ఈ మేరకు కలెక్టర్ సోమవారం ఒక అధికారిక ప్రకటన విడుదల చేశారు.

ఎన్నికలు జరిగే సంబంధిత ప్రాదేశిక నియోజకవర్గాల్లో ఓటు హక్కు లేని రాజకీయ నాయకులు, స్టార్ క్యాంపెయినర్లు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన కార్యకర్తలు మంగళవారం సాయంత్రం 5:00 గంటల లోపు ఆయా ప్రాంతాలను విడిచి వెళ్లిపోవాలని కలెక్టర్ తెలిపారు. మండల కేంద్రాల్లోని లాడ్జీలు, కల్యాణ మండపాలు, కమ్యూనిటీ భవనాలు, ప్రైవేటు వసతి గృహాల్లో పోలీసులు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తాయని, నిబంధనలకు విరుద్ధంగా బయటి వ్యక్తులు ఎవరైనా ఆశ్రయం పొందితే వారిపై, సదరు యాజమాన్యాల పై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సాయంత్రం 5:00 గంటల తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ మైకులు, లౌడ్ స్పీకర్లు, ర్యాలీలు, రోడ్‌షోలు, బహిరంగ సమావేశాలు నిర్వహించరాదని, ఇంటింటి ప్రచారం సైతం ఎన్నికల నిబంధనలకు లోబడి మాత్రమే చేపట్టాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఎన్నికల కోడ్ ముగిసే వరకు సోషల్ మీడియా, వాట్సాప్ గ్రూపులు, ఎస్ఎంఎస్‌ల ద్వారా ఓటర్లను ప్రలోభపెట్టే సందేశాలు, ప్రకటనలు పంపడం పై సైబర్ విభాగం గట్టి నిఘా ఉంచుతుందని కలెక్టర్ తెలిపారు. ప్రచారం ముగిసిన సమయం నుంచి పోలింగ్ ముగిసే వరకు ఎన్నికలు జరిగే ప్రాంతాల్లో మద్యం విక్రయాల పై పూర్తిగా నిషేధం అమల్లో ఉంటుందని, సరిహద్దుల వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి అక్రమ రవాణాను అడ్డుకుంటామన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు నిష్పాక్షికంగా, ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు అన్ని రాజకీయ పక్షాలు, అభ్యర్థులు, ఓటర్లు సహకరించాలని, నిబంధనలను అతిక్రమిస్తే చట్టపర మైన కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు.



ఓట్ల లెక్కింపు ప్రక్రియను అత్యంత జాగ్రత్తగా, పారదర్శకంగా నిర్వహించాలి.



కౌంటింగ్ విధివిధానాలు, ఎన్నికల నిబంధనల పై అధికారులకు కమిషనర్ దిశానిర్దేశం.

రిటర్నింగ్ అధికారులు, జోనల్ కమిషనర్లు, జోనల్ ప్రత్యేక అధికారులు సమన్వయంతో పనిచేయాలి.

కౌంటింగ్ సిబ్బంది సంయమనం, ఓర్పు, అప్రమత్తతతో విధులు నిర్వహించాలి.

కౌంటింగ్ హ్యాండ్ బుక్ లోని మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలి.

జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్.

విశాఖపట్నం, పెన్ సత్తా, నవంబర్ 02: జీవీఎంసీ రెండవ సాధారణ ఎన్నికలు 2026 కు సంబంధించి నవంబర్ 3 వ తేదీన నిర్వహించనున్న ఓట్ల లెక్కింపు ప్రక్రియను సజావుగా, పారదర్శకంగా, ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్‌లో ఏర్పాటు చేసిన గాజువాక జోన్ కౌంటింగ్ కేంద్రం ఆవరణలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ పై రిటర్నింగ్ అధికారులు, జోనల్ కమిషనర్లు, జోనల్ ప్రత్యేక అధికారులు, జీవీఎంసీ ఉన్నతాధికారులు, వివిధ విభాగాల అధికారులతో కమిషనర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.



ఈ సందర్భంగా కౌంటింగ్ ప్రక్రియలో అనుసరించాల్సిన విధి విధానాలు, ఎన్నికల నిబంధనలు, అధికారులు మరియు సిబ్బంది నిర్వర్తించాల్సిన బాధ్యతలు, తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలను కమిషనర్ క్షుణ్ణంగా వివరించారు. కౌంటింగ్ విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బంది ప్రతి దశలోనూ సంయమనం, ఓర్పు, అప్రమత్తత పాటిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. కౌంటింగ్ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఎన్నికల నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని స్పష్టం చేశారు. ప్రతి జోన్ కు కేటాయించిన కౌంటింగ్ కేంద్రాలను సంబంధిత అధికారులు, సిబ్బంది ముందుగానే సందర్శించి, అక్కడి ఏర్పాట్లు, తమకు కేటాయించిన విధులు, బాధ్యతల పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కౌంటింగ్ ప్రారంభానికి ముందే అవసర మైన అన్ని ఏర్పాట్లు, సౌకర్యాలు సమకూర్చుకోవాలని ఆదేశించారు. కౌంటింగ్ ప్రక్రియకు సంబంధించి అధికారులకు అందించిన హ్యాండ్ బుక్ ను పూర్తిగా పరిశీలించి, అందులో పొందుపరిచిన మార్గదర్శకాలు, సూచనలు, విధివిధానాలను తప్పనిసరిగా అనుసరిస్తూ విధులు నిర్వహించాలని కమిషనర్ దిశానిర్దేశం చేశారు. కౌంటింగ్ ప్రక్రియలో ప్రతి అధికారి తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ, పరస్పర సమన్వయంతో పనిచేయాలని, ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా ఓట్ల లెక్కింపు ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలని కమిషనర్ సూచించారు.



తుఫాన్ బాధిత కుటుంబాలకు నిత్యావసర సరుకుల పంపిణీ.

సరుకులు చేసిన జిల్లా జాయింట్ కలెక్టర్ శౌరిమాన్ పటేల్.





అనకాపల్లి, పెన్ సత్తా, నవంబర్ 02: సోమవారం అర్నాబ్ తుఫాన్ ప్రభావంతో అనకాపల్లి జిల్లా లోని పలు మండలాల్లో తీవ్రంగా నష్టపోయిన బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తరపున నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. తక్షణ చర్యల్లో భాగంగా జిల్లా లోని రేషన్ కార్డుదారు లైన 1,343 మంది బాధిత కుటుంబాలతో పాటు 2,5681 మంది మత్స్యకారులు, 250 మంది చేనేత కార్మికులకు సంబంధిత రేషన్ దుకాణాల ద్వారా నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా మత్స్యకారులు, చేనేత కార్మికులకు 50 కేజీల బియ్యంతో పాటు కేజీ చొప్పున పంచదార, కందిపప్పు, ఉల్లిపాయలు, బంగాళాదుంపలు, నూనె(1లీటర్) పంపిణీ చేస్తున్నారు. ఇతర బాధిత కుటుంబాలకు 25 కేజీల బియ్యంతో పాటు కేజీ చొప్పున పంచదార, కందిపప్పు, ఉల్లిపాయలు, బంగాళాదుంపలు, నూనె(1 లీటర్) పంపిణీ చేస్తున్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్, నక్కపల్లి మండలం పెదతీనార్ల లోని రేషన్ షాపు నంబర్ 0339011 వద్ద ఈ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. నవంబర్ 2 వ తేదీ నుండి ఈ పంపిణీ కొనసాగుతుందని ఒక ప్రకటనలో తెలియజేసియున్నా ఉన్నారు.

సుస్థిర జీవన శైలి పై అవగాహన కార్యక్రమం.



అచ్యుతాపురం, పెన్ సత్తా, నవంబర్ 02: అచ్యుతాపురం మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో సోమవారం, బ్రిక్స్ సస్టైనబుల్ లైఫ్ స్టైల్ వీక్ – 2026 సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విజయవాడ కేంద్ర కార్యాలయం నుంచి వచ్చిన సర్క్యులర్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మహిళా సమాఖ్య ఈసీ సభ్యులు, సిబ్బంది గ్రామాల్లోని డ్వాక్రా మహిళలకు సుస్థిర జీవన శైలి పై అవగాహన కల్పించాలని నిర్ణయించారు.

ఈ సందర్భంగా సుస్థిర ఆరోగ్యకర మైన జీవన శైలి, విద్యుత్ ఆదా, నీటి సంరక్షణ, సుస్థిర ఆహార వ్యవస్థలు, ఒకసారి వినియోగించే ప్లాస్టిక్‌ను తిరస్కరించడం, వ్యర్థాల తగ్గింపు, సర్క్యులర్ ఎకానమీ వంటి ఏడు ముఖ్య మైన అంశాల పై వివరణ ఇచ్చారు. పర్యావరణ పరి రక్షణలో ప్రతి ఒక్కరూ తమ బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు. కార్యక్రమ ముగింపులో పాల్గొన్న మహిళలు, అధికారులు సుస్థిర జీవన శైలిని అవలంబించడానికి ప్రతిజ్ఞ చేశారు.

ఈ కార్యక్రమంలో ఏపీఎంఎస్ శ్రీనివాస రావు, సీసీలు రమేష్, రాంబాబు, సరోజిని, కృష్ణ, దేముడు, పద్మావతి, నాగరాజు, మాస్టర్ ట్రైనర్, జెండర్ పాయింట్ పర్సన్ పి. అరుణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీలతో ఎన్నికల ప్రచారం



చోడవరం, నవంబర్2 పెన్ సత్తా.... మండలంలోని గోవాడ గ్రామంలో ఉపాధి హామీ కూలీలతో కూటమి పార్టీ నాయకులు సమావేశం నిర్వహించి ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా కూటమి జెడ్పిటిసి అభ్యర్థి కనిశెట్టి సన్యాసిరావు (మత్స్యరాజు) మాట్లాడుతూ.... రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓట్లు వేసి జడ్పిటిసి అభ్యర్థిగా తనను గెలిపించాలని కోరారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నందున కూటమి అభ్యర్థులను గెలిపిస్తే మన ప్రాంతం అభివృద్ధి అవుతుందని పేర్కొన్నారు. మన ప్రాంతం అభివృద్ధి మన చేతుల్లోనే ఉందని అన్నారు. అలాగే గాజు గ్లాసు గుర్తుకు ఓట్లు వేసి ఎంపీటీసీ అభ్యర్థినిగా బండి సంతోషిలక్ష్మి (గోపి) ని గెలిపించాలని జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి, చోడవరం మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లం రామ అప్పారావు కోరారు. ఈ ప్రచారంలో మాజీ సర్పంచ్ ఏడువాక లక్ష్మణ్ కుమార్, కోపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఏడువాక అర్జున్ మాస్టర్, భారీగా కూటమి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

జడ్పిటిసి ఎంపీటీసీలను గెలిపించాలని పి.వి.ఎస్.ఎన్ రాజు ప్రచారం





మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లం మాధవి రామఅప్పారావు, జనసేన నాయకులు పీలా మహేష్, మాజీ సర్పంచ్ వేగి శ్రీనివాసరావు, భారీగా కూటమి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

చోడవరం, నవంబర్2 పెన్ సత్తా.... మండలంలోని అంబేరుపురం గ్రామంలో జనసేన పార్టీ చోడవరం నియోజకవర్గం ఇన్చార్జి పి.వి.ఎస్.ఎన్ రాజు విస్తృతంగా ఎన్నికల ప్రచారం చేశారు. ఈనెల 5న జరగనున్న ఎంపీటీసీలు, జడ్పిటిసి ఎన్నికల్లో కూటమి పార్టీ అభ్యర్థులకు ఓట్లు వేసి ప్రజలు గెలిపించాలని కోరారు. అంబేరుపురం ఎంపీటీసీ అభ్యర్థిగా జనసేన పార్టీకి చెందిన దాడి వెంకట అప్పారావు పోటీ చేస్తున్నందున గాజు గ్లాసు గుర్తుకు ఓట్లు వేసి గెలిపించాలని, అలాగే కూటమి జడ్పిటిసి అభ్యర్థి కనిశెట్టి సన్యాసిరావు (మత్స్యరాజు) కు సైకిల్ గుర్తుకు ఓట్లు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలుతో గ్రామం అంతా తిరిగి ప్రచారం చేశారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలో ఉన్నందున కూటమీ అభ్యర్థులను గెలిపిస్తే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. ఈ ప్రచారానికి ప్రజల నుండి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి అభ్యర్థి కనిశెట్టి మత్స్యరాజు, ఎంపీటీసీ అభ్యర్థి దాడి వెంకట అప్పారావు, చోడవరం

ఎంపిటిసి అభ్యర్థి బైన ఈశ్వరరావు ప్రచారానికి విశేష స్పందన





చోడవరం, నవంబర్2 పెన్ సత్తా.... మండలంలోని కన్నంపాలెం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎంపీటీసీ అభ్యర్థి బైన ఈశ్వరరావు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఆయన గతంలో సర్పంచ్ గా, ఎంపీటీసీగా చేసి తాజాగా చోడవరం మండలం వైస్ ఎంపీపీగా మాజీ అయ్యారు. మళ్లీ ఎంపిటిసిగా పోటీ చేస్తున్నారు. ఈనెల 5న జరగనున్న ఎన్నికల్లో 2 ఓట్లు ఫ్యాన్ గుర్తుకు వేసి జడ్పిటిసిగా దొడ్డి వెంకటరావును, ఎంపీటీసీగా తనను (బైన ఈశ్వరరావు) గెలిపించాలని కోరారు. ఈయన ప్రచారానికి విశేష స్పందన లభించింది. ఈ ప్రచారంలో మాజీ సర్పంచ్ పోతల జానకి ప్రసాద్, భారీగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

వైసిపి జడ్పిటిసి అభ్యర్థి డివిఆర్ కు ప్రజలు భారీగా ప్రచారం





చోడవరం, నవంబర్2 పెన్ సత్తా.... వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ చోడవరం మండలం జడ్పిటిసి అభ్యర్థి దొడ్డి వెంకటరావు (డి.వి.ఆర్) గ్రామాల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈనెల 5న గురువారం జరగనున్న జడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి గెలిపించాలని డి.వి.ఆర్ కోరారు. ఈ సందర్భంగా జడ్పిటిసి అభ్యర్థి దొడ్డి వెంకటరావు (డి.వి.ఆర్) మాట్లాడుతూ.... రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి రెండున్నర ఏళ్ళు అయినా చోడవరం చక్కర కర్మాగారాన్ని కాపాడలేకపోయారని, చెరుకు క్రస్సింగ్ చేయకపోవడం వలన కార్మికులు రోడ్డుమీద పడడమే కాకుండా, రైతులు ఏ పంట పండించాలో తెలియని అయోమయంలో ఉండాలని, గత సీజన్ లో క్రస్సింగ్ జరపకపోగా, ఇంతకుముందు సీజన్ 2024-2025 లో చెరుకు సప్లై చేసిన రైతులకు ఇంతవరకు పేమెంట్లు చేయకపోవడం చాలా అన్యాయమని, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి రూ 89 కోట్లు నిధులు మంజూరు చేసి ఫ్యాక్టరీని ఆదుకున్నారని, ఆ తర్వాత కూటమి ప్రభుత్వం, స్థానిక నాయకులు కనీసం పట్టించుకోలేదని విమర్శించారు. అలాగే చోడవరం నియోజకవర్గంలో ఉన్న అద్వానమైన రోడ్లు ఎక్కడ లేవని, అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందుతున్నా చోడవరం మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఉందని, కొత్తగా పరిశ్రమలు తీసుకు రాకపోయినా కనీసం ఉన్న కూడా నాయకులు ఆదుకోవడం లేదని ఎద్దేవా చేశారు. స్థానిక ఎన్నికల్లో రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకు వేసి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపిస్తే, ప్రభుత్వానికి కనువిప్పు కలగడమే కాకుండా చోడవరం ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకోవడానికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకు వేసి జడ్పిటిసి అభ్యర్థిగా తనను, ఎంపీటీసీలను గెలిపించాలని డివిఆర్ కోరారు. ఈ ప్రచారానికి ప్రజల నుండి విశేష స్పందన లభించింది. ఈ ప్రచారంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా పాల్గొన్నారు.

ఎంపీపీగా గెలిపిస్తే అభివృద్ధి చేసి చూపిస్తా....





గేదెల సత్యనారాయణ

బుచ్చయ్యపేట,నవంబర్2 పెన్ సత్తా.... రానున్న ఎన్నికల్లో తనను ఎంపీపీగా గెలిపిస్తే బుచ్చియ్యపేట మండలాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని టిడిపి సీనియర్ నాయకులు, విశాఖ డైయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ అన్నారు. గురువారం ఎంపీపీ అభ్యర్థి గేదెల సత్యనారాయణ తిరిగి ఈనెల 5న గురువారం జరగనున్న స్థానిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. కూటమి ప్రభుత్వంలో భాగంగా కొన్ని టిడిపికి, మరి కొన్ని జనసేనకు, కొన్ని బిజెపికి ఎంపీటీసీలు, జడ్పిటిసిలు కేటాయించడం జరిగిందని, టిడిపి అభ్యర్థి పోటీలో ఉన్న చోట సైకిల్ గుర్తుకు, జనసేన అభ్యర్థి ఉన్నచోట గాజు గ్లాస్ కు ఓట్లు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ ప్రచారానికి ప్రజల్లో విశేష స్పందన లభించింది. ఈ ప్రచారంలో ఎంపిటిసి అభ్యర్థులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా పాల్గొన్నారు.

దీపావళికి గ్రీన్ క్రాకర్స్‌కు సుప్రీంకోర్టు ఓకే!



న్యూఢిల్లీ: దీపావళి పండుగ సందర్భంగా ఢిల్లీ-ఎన్‌సీఆర్ ప్రాంతంలో పర్యావరణహిత బాణాసంచా కాల్చేందుకు సుప్రీంకోర్టు పరిమిత అనుమతులు మంజూరు చేసింది. నవంబర్ 7, 8 తేదీల్లో మాత్రమే గ్రీన్ క్రాకర్స్ వినియోగించుకోవచ్చని స్పష్టం చేసింది. ఉదయం 6 నుంచి 7 గంటల వరకు, తిరిగి రాత్రి 8 నుంచి 10 గంటల వరకు మాత్రమే టపాసులు కాల్చేందుకు అనుమతించింది. నవంబర్ 9 నుంచి బాణాసంచాపై తిరిగి పూర్తి స్థాయి నిషేధం అమల్లోకి వస్తుందని వెల్లడించింది.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

ఆస్పత్రులు, నర్సింగ్ హోమ్‌లు, విద్యాసంస్థలు, వృద్ధాశ్రమాలు, ఆరోగ్య కేంద్రాలు, సైలెన్స్ జోన్‌లకు 300 మీటర్ల పరిధిలో బాణాసంచా కాల్చడంపై నిషేధం విధించింది. బేరియం వినియోగించిన టపాసులతో పాటు, గ్రీన్ క్రాకర్స్‌గా ధ్రువీకరణ పొందని బాణాసంచా విక్రయాలను అడ్డుకోవాలని అధికారులను ఆదేశించింది. హండ్రెడ్ వాలా, థౌజండ్ వాలా వంటి భారీ శబ్దాలు చేసే టపాసుల వినియోగాన్ని కూడా అనుమతించబోమని స్పష్టం చేసింది.

కాలుష్యంపై నిరంతర పర్యవేక్షణ అవసరం

గతంలో జారీ చేసిన ఆదేశాలు క్షేత్రస్థాయిలో ఆశించిన ఫలితాలను ఇవ్వలేదని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. అధికారుల మధ్య సమన్వయ లోపమే ఇందుకు ప్రధాన కారణమని అభిప్రాయపడింది. పండుగ సమయంలోనే కాకుండా, ఆ తర్వాత కూడా పర్యావరణ కాలుష్యంపై నిరంతరం సమీక్ష జరగాలని సూచించింది. కేంద్ర, ఢిల్లీ కాలుష్య నియంత్రణ మండళ్ల పర్యవేక్షణ కేంద్రాల నుంచి గాలి నాణ్యత సూచీ వివరాలను సేకరించాలని ఆదేశించింది.

ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం

కాలుష్యం కారణంగా ఆస్పత్రుల్లో పెరుగుతున్న రోగుల సంఖ్య, మరణాల వివరాలను ఢిల్లీ-ఎన్‌సీఆర్ పరిధిలోని ఆరోగ్య కేంద్రాల నుంచి సేకరించాలని ధర్మాసనం పేర్కొంది. పటాకుల వల్ల గాలి, శబ్ద కాలుష్యం పెరిగి చిన్నారులు, దివ్యాంగులు, వృద్ధులు సహా సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేసింది. ప్రకృతిలోని పంచభూతాలను పూజించే సంస్కృతి మనదని, ఏ మతాచారమైనా ప్రకృతి పరిరక్షణకు అనుగుణంగా ఉండాలని వ్యాఖ్యానించింది.

దియామీర్జా వీడియోపై వివాదం..
తొలగించిన బీఎంసీ

మరోవైపు పర్యావరణహిత దీపావళిపై బృహన్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) రూపొందించిన ప్రచార వీడియో వివాదానికి దారితీసింది. సినీనటి దియా మీర్జా నటించిన ఈ వీడియోలో కాలుష్యానికి దూరంగా దీపావళి జరుపుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అయితే బీజేపీ నాయకుడు అమిత్ సతమ్ దీనిపై అభ్యంతరం వ్యక్తం చేశారు. దీపావళి ఎలా జరుపుకోవాలో ఎవరి దగ్గరా పాఠాలు నేర్చుకోవాల్సిన అవసరం లేదని వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో వివాదం చెలరేగడంతో బీఎంసీ తన సోషల్ మీడియా ఖాతాల నుంచి ఆ వీడియోను తొలగించింది. కాలుష్య రహిత దీపావళిపై అవగాహన కల్పించేందుకు బీఎంసీ చేపట్టిన ప్రచారంలో భాగంగానే ఈ వీడియో రూపొందించారు.

భారత వైమానిక దళానికి కొత్త అధిపతి



న్యూఢిల్లీ: భారత వైమానిక దళానికి కొత్త అధిపతిగా ఎయిర్ చీఫ్ మార్షల్ అశుతోష్ దీక్షిత్ బాధ్యతలు చేపట్టారు. దేశానికి 42 ఏళ్లపాటు విశిష్ట సేవలందించిన ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్ స్థానంలో ఆయన నియమితులయ్యారు. ఈ సందర్భంగా రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అశుతోష్ దీక్షిత్‌ను కలిసి అభినందనలు తెలిపారు. ఆయన పదవీకాలం విజయవంతంగా సాగాలని ఆకాంక్షించారు. భారత వైమానిక దళానికి అద్భుతమైన నాయకత్వాన్ని అందించగల సమర్థుడైన వాయు యోధుడిగా దీక్షిత్‌ను కొనియాడారు.

స్వదేశీ రక్షణ సామర్థ్యాలకు ప్రాధాన్యం

వైమానిక దళ పోరాట సంసిద్ధతను మరింత బలోపేతం చేయడం, కార్యాచరణ సామర్థ్యాలను పెంపొందించడం, స్వదేశీ రక్షణ రంగాన్ని అభివృద్ధి చేయడం తన ప్రాధాన్యతలని అశుతోష్ దీక్షిత్ స్పష్టం చేశారు. సాంకేతిక ఆవిష్కరణలు, త్రివిధ దళాల మధ్య సమన్వయానికి కూడా ప్రాధాన్యం ఇస్తానని వెల్లడించారు.

నాలుగు దశాబ్దాల విశిష్ట సేవలు

నేషనల్ డిఫెన్స్ అకాడమీ పూర్వ విద్యార్థి అయిన అశుతోష్ దీక్షిత్ 1986 డిసెంబర్ 6న భారత వైమానిక దళ ఫైటర్ విభాగంలో చేరారు. తన సుదీర్ఘ కెరీర్‌లో కార్యాచరణ, విమాన పరీక్షలు, సామర్థ్యాల అభివృద్ధి, సంయుక్త రక్షణ వ్యవహారాలు వంటి కీలక విభాగాల్లో పనిచేశారు. నిష్ణాతుడైన ఫైటర్ పైలట్‌తో పాటు ఫ్లయింగ్ ఇన్‌స్ట్రక్టర్, టెస్ట్ పైలట్‌గా గుర్తింపు పొందారు. మిరాజ్-2000, మిగ్ విమానాల వివిధ రకాలు, జాగ్వార్, రవాణా విమానాలను నడిపిన ఆయనకు 3,300 గంటలకు పైగా విమానయాన అనుభవం ఉంది.

వైమానిక దళ ఆధునీకరణలో కీలక పాత్ర

భారత వైమానిక దళ ఆధునీకరణలో దీక్షిత్ కీలక పాత్ర పోషించారు. జాగ్వార్, మిగ్-27 విమానాల ఆధునీకరణ ప్రాజెక్టులతో పాటు స్వదేశీ తేజస్ ఎల్‌సీఏ మార్క్-1 యుద్ధ విమానానికి ప్రారంభ, తుది కార్యాచరణ అనుమతుల ప్రక్రియలో ముఖ్యమైన బాధ్యతలు నిర్వహించారు. మిరాజ్-2000 స్క్వాడ్రన్, బీదర్ వైమానిక స్థావరం సహా పలు కీలక విభాగాలకు నాయకత్వం వహించారు.

ఆపరేషన్ సింధూర్‌లోనూ కీలక బాధ్యతలు

సదరన్ ఎయిర్ కమాండ్‌లో ఎయిర్ డిఫెన్స్ కమాండర్‌గా, సౌత్ వెస్ట్రన్ ఎయిర్ కమాండ్‌లో సీనియర్ ఎయిర్ స్టాఫ్ ఆఫీసర్‌గా పనిచేశారు. డిప్యూటీ చీఫ్ ఆఫ్ ది ఎయిర్ స్టాఫ్, సెంట్రల్ ఎయిర్ కమాండ్ ఎయిర్ ఆఫీసర్ కమాండింగ్-ఇన్-చీఫ్ వంటి కీలక పదవులు చేపట్టారు. ఆపరేషన్ సింధూర్ సమయంలో చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ కమిటీ చైర్మన్‌కు చీఫ్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ డిఫెన్స్ స్టాఫ్‌గా సేవలందించారు. వైస్ చీఫ్ ఆఫ్ ది ఎయిర్ స్టాఫ్‌గా కూడా పనిచేశారు.

పతకాలతో విశిష్ట గుర్తింపు

సైనిక సేవలకు గుర్తింపుగా అశుతోష్ దీక్షిత్‌కు 2026లో పరమ విశిష్ట సేవా పతకం, 2023లో అతి విశిష్ట సేవా పతకం, 2011లో విశిష్ట సేవా పతకం, 2006లో వాయుసేన పతకం లభించాయి. నాలుగు దశాబ్దాల అనుభవంతో ఇప్పుడు దేశ వైమానిక దళానికి నాయకత్వం వహించనున్నారు.

రోడ్డు పనుల్లో పెను విషాదం



ఝుంఝునూ: రాజస్థాన్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. రోడ్డు నిర్మాణ పనులు చేస్తుండగా హైటెన్షన్ విద్యుత్ తీగలు తగలడంతో ఎనిమిది మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఝుంఝునూ జిల్లాలోని ఉదయ్‌పుర్‌వాటి ప్రాంతం ఛాపోలీ గ్రామంలో ఈ దుర్ఘటన జరిగింది. రోడ్డు పనుల్లో ఉపయోగిస్తున్న యంత్రం 11 వేల వోల్టుల సామర్థ్యం కలిగిన విద్యుత్ తీగలకు తగలడంతో ఈ ప్రమాదం సంభవించింది.

యంత్రానికి విద్యుత్ సరఫరా.. కుప్పకూలిన కార్మికులు

గ్రామస్థుల సహకారంతో ఛాపోలీ గ్రామంలో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. ఇందులో భాగంగా కంకర కలిపేందుకు ప్రత్యేక యంత్రాన్ని ఏర్పాటు చేశారు. కదమ్ కుండ్ వైపు వెళ్లే రహదారిపై పనులు జరుగుతుండగా యంత్రం పైన ఉన్న హైటెన్షన్ విద్యుత్ తీగలకు తగిలింది. దీంతో ఒక్కసారిగా యంత్రంలోకి విద్యుత్ ప్రవహించింది. సమీపంలో పనిచేస్తున్న కార్మికులు విద్యుదాఘాతానికి గురై కుప్పకూలిపోయారు. ప్రమాద తీవ్రతకు అక్కడివారికి స్పందించే అవకాశం కూడా లేకుండా పోయింది. సమాచారం అందుకున్న గ్రామస్థులు వెంటనే సహాయక చర్యలు చేపట్టి బాధితులను ఆస్పత్రులకు తరలించారు.

ఘటనా స్థలానికి జిల్లా కలెక్టర్

ప్రమాదం గురించి గ్రామస్థులు ఫోన్ ద్వారా సమాచారం అందించారని ఝుంఝునూ జిల్లా కలెక్టర్ అరుణ్ గార్గ్ తెలిపారు. ప్రాథమిక వివరాల ప్రకారం ఐదుగురు కార్మికులు అక్కడికక్కడే మరణించారని వెల్లడించారు. మరో ఆరుగురిని ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ముగ్గురు ప్రాణాలు కోల్పోయారని చెప్పారు. దీంతో మృతుల సంఖ్య ఎనిమిదికి చేరిందని, మరో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉందని వివరించారు. సమాచారం అందిన వెంటనే తాను ఘటనా స్థలానికి బయలుదేరినట్లు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే భగవానారామ్ సైనీ, రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి కూడా ప్రమాదంపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం: సీఎం

ఈ దుర్ఘటనపై రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కార్మికులు విద్యుదాఘాతంతో మృతి చెందడం హృదయవిదారకమని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. మృతుల కుటుంబాలకు తక్షణ సహాయం అందించాలని, ప్రమాదానికి గల కారణాలపై సమగ్ర విచారణ చేపట్టాలని సూచించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

బాధ్యులెవరో తేల్చాలి: అశోక్ గహ్లోత్

మాజీ ముఖ్యమంత్రి అశోక్ గహ్లోత్ సైతం ఈ ఘటనపై స్పందించారు. రోడ్డు నిర్మాణ పనుల సమయంలో ఇంతటి ఘోర ప్రమాదం ఎలా జరిగిందో సమగ్రంగా దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. ప్రమాదానికి బాధ్యులెవరో గుర్తించాలని అధికారులను కోరారు. మృతుల కుటుంబాలకు తగిన పరిహారం అందించడంతో పాటు ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు.

ఎస్ఐఆర్ దెబ్బ..
ఐదు రాష్ట్రాల్లో 2.28 కోట్ల ఓట్లు మాయం!



న్యూఢిల్లీ: ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రభావం ఐదు రాష్ట్రాల్లో స్పష్టంగా కనిపిస్తోంది. వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, గోవా, పంజాబ్, మణిపుర్ రాష్ట్రాల్లో ఓటర్ల సంఖ్య గణనీయంగా తగ్గినట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. ఎస్ఐఆర్‌కు ముందు ఈ ఐదు రాష్ట్రాల్లో కలిపి 18.71 కోట్ల మంది ఓటర్లు ఉండగా, సవరణ అనంతరం ఆ సంఖ్య 16.43 కోట్లకు పడిపోయింది. మొత్తంగా సుమారు 2.28 కోట్ల మంది ఓటర్ల పేర్లు తగ్గినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

యూపీలో అత్యధికంగా తగ్గిన ఓటర్లు

ఈ ఐదు రాష్ట్రాల్లో ఉత్తరప్రదేశ్‌లోనే అత్యధికంగా ఓటర్ల సంఖ్య తగ్గింది. ఎస్ఐఆర్‌కు ముందు 15.44 కోట్లుగా ఉన్న ఓటర్ల సంఖ్య తుది జాబితాలో 13.40 కోట్లకు చేరింది. అంటే సుమారు 2.04 కోట్ల మంది తగ్గారు. మొత్తం ఐదు రాష్ట్రాల్లో సమోదైన తగ్గుదలలో దాదాపు 90 శాతం ఉత్తరప్రదేశ్ నుంచే ఉంది. ఆ రాష్ట్రంలో ఓటర్ల సంఖ్య 13.24 శాతం తగ్గడం గమనార్హం.

అర్హులకు మరో అవకాశం

ఓటరు జాబితాలో పేర్లు గల్లంతైన అర్హులైన పౌరులు మరోసారి తమ పేర్లను నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించనున్నట్లు ఎన్నికల సంఘం తెలిపింది. ప్రస్తుతం చేపడుతున్న ప్రత్యేక సంక్షిప్త సవరణ (ఎస్ఎస్ఆర్) ప్రక్రియలో భాగంగా ఈ అవకాశం ఉంటుంది. అంతేకాకుండా 2027 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండే యువత కూడా ఓటరుగా నమోదు చేసుకోవచ్చని స్పష్టం చేసింది.

బీజేపీ ప్రచారం బూమరాంగ్..
దిల్లీలో యథావిధిగా మార్కెట్లు!

న్యూఢిల్లీ: దేశ రాజధాని దిల్లీలో ఇండియా కూటమి నిర్వహించిన భారీ ర్యాలీ రాజకీయ విమర్శలకు కేంద్రంగా మారింది. ర్యాలీ కారణంగా నగరంలోని వ్యాపారాలు దెబ్బతింటాయని, మార్కెట్లు మూతపడతాయని బీజేపీ చేసిన ప్రచారాన్ని కాంగ్రెస్ తీవ్రంగా ఖండించింది. ఆదివారం దిల్లీలో దుకాణాలు యథావిధిగా తెరిచి ఉండటంతో పాటు వ్యాపార కార్యకలాపాలు కూడా కొనసాగాయని పేర్కొంది. బీజేపీ చేసిన ప్రచారం బెడిసికొట్టిందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ విమర్శించారు.

ప్రజలను భయపెట్టే ప్రయత్నం విఫలం

ఇండియా కూటమి ర్యాలీకి ప్రజలు హాజరుకాకుండా అడ్డుకునేందుకు, కార్యక్రమం ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు అధికార పార్టీ ప్రయత్నించిందని జైరాం రమేశ్ ఆరోపించారు. రాజకీయ కార్యక్రమాల వల్ల వ్యాపారాలకు నష్టం జరుగుతుందన్న ప్రచారం అవాస్తవమని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి దిల్లీకి వచ్చిన ప్రజలు స్థానిక మార్కెట్లలో కొనుగోళ్లు చేయడం ద్వారా వ్యాపారులకు ప్రయోజనం చేకూర్చారని తెలిపారు. పెద్ద వ్యాపార సంస్థలతో పాటు చిన్న దుకాణదారులు, వీధి వ్యాపారుల వద్ద కూడా కొనుగోళ్లు జరిగాయని వెల్లడించారు.

ఓటు చోరీ అంశం నుంచి దృష్టి మళ్లించేందుకే..

దేశంలో చర్చనీయాంశంగా మారిన ఓటు చోరీ ఆరోపణలు, ఎన్నికల సంఘం జవాబుదారీతనం వంటి అంశాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే బీజేపీ ఈ ప్రచారానికి తెరతీసిందని జైరాం రమేశ్ ఆరోపించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను కాపాడేందుకు, ఇండియా కూటమి ర్యాలీకి ప్రజలు రాకుండా నిరుత్సాహపరిచేందుకు ప్రయత్నించిందని విమర్శించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం నిర్వహించిన కార్యక్రమానికి మద్దతు ఇస్తూనే స్థానిక ఆర్థిక వ్యవస్థకు చేయూతనిచ్చిన దిల్లీ ప్రజలు, వ్యాపారులకు కృతజ్ఞతలు తెలిపారు.

స్థానిక వ్యాపారులకు రాహుల్ పిలుపు

ఇండియా కూటమి ర్యాలీ వల్ల వ్యాపారాలకు నష్టం వాటిల్లుతుందని పేర్కొంటూ ఓ వ్యాపారుల సంఘం రాహుల్ గాంధీకి లేఖ రాసి, ర్యాలీని వాయిదా వేయాలని కోరింది. దీనిపై స్పందించిన రాహుల్ గాంధీ.. దీపావళి సందర్భంగా దిల్లీకి వచ్చిన ప్రజలు స్థానిక వ్యాపారులకు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. శనివారం రాత్రి సామాజిక మాధ్యమాల ద్వారా ఈ పిలుపునిచ్చారు. పండుగ కొనుగోళ్లను స్థానిక దుకాణాల్లోనే చేయాలని కోరారు. ర్యాలీ కారణంగా వ్యాపారాలకు ఇబ్బందులు ఉండవని స్పష్టం చేశారు.

ఎన్నికల సంఘంపై ప్రతిపక్షాల ప్రశ్నలు

ఆదివారం జరిగిన ఇండియా కూటమి ర్యాలీలో ప్రతిపక్ష నేతలు బీజేపీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ఎన్నికల్లో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలు, ఓటర్ల హక్కుల పరిరక్షణ, ఎన్నికల సంఘం బాధ్యతలపై ప్రశ్నలు లేవనెత్తారు. ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడేందుకు ప్రతిపక్షాలన్నీ ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. మొత్తంగా ర్యాలీకి ముందు బీజేపీ చేసిన ప్రచారం, అనంతరం కాంగ్రెస్ చేసిన ఎదురుదాడితో దిల్లీ రాజకీయాలు వేడెక్కాయి.

పంజాబ్‌లో ఆప్‌కు భారీ షాక్..
బీజేపీలోకి ముగ్గురు ఎమ్మెల్యేలు!

చండీగఢ్: పంజాబ్‌లో అధికార ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. 2027 అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గరపడుతున్న వేళ పార్టీకి చెందిన ముగ్గురు కీలక నేతలు భారతీయ జనతా పార్టీలో చేరారు. మాజీ ఐపీఎస్ అధికారి, అమృత్‌సర్ నార్త్ మాజీ ఎమ్మెల్యే కున్వర్ విజయ్ ప్రతాప్ సింగ్‌తో పాటు హర్మీత్ సింగ్ పఠాన్‌మాజ్రా, చేతన్ సింగ్ జౌరమాజ్రా సోమవారం బీజేపీ కండువా కప్పుకున్నారు. ఇప్పటికే ఆప్ నాయకత్వంపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ విమర్శలు చేస్తున్న నేతలు ఒకేసారి పార్టీ మారడం పంజాబ్ రాజకీయాల్లో చర్చనీయాంశమైంది.

పార్టీ నాయకత్వంతో విభేదాలు

హర్మీత్ సింగ్ పఠాన్‌మాజ్రా పటియాలా జిల్లాలోని సనౌర్ నియోజకవర్గానికి, చేతన్ సింగ్ జౌరమాజ్రా సమానా నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలతో ఆప్ నాయకత్వం వీరిని సస్పెండ్ చేసింది. అనంతరం ఇద్దరూ పార్టీకి రాజీనామా చేశారు. వారి శాసనసభ సభ్యత్వాలను రద్దు చేయాలని కోరుతూ స్పీకర్‌కు ఫిర్యాదు చేసేందుకు ఆప్ సిద్ధమైంది. మరోవైపు కున్వర్ విజయ్ ప్రతాప్ సింగ్ కూడా సోమవారం తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారు. రాజీనామా లేఖను అసెంబ్లీ స్పీకర్‌కు పంపించారు. 2025 జూన్ 29న ఆప్ నుంచి సస్పెన్షన్‌కు గురైన ఆయన అప్పటి నుంచి పార్టీ నాయకత్వం, ప్రభుత్వ విధానాలపై బహిరంగంగా విమర్శలు చేస్తున్నారు.

'పంజాబ్ ఫస్ట్'.. విజయ్ ప్రతాప్ స్పష్టం

బీజేపీలో చేరడానికి ముందు కున్వర్ విజయ్ ప్రతాప్ సింగ్ ఎక్స్ వేదికగా అమృత్‌సర్ ప్రజలకు సందేశం ఇచ్చారు. తనకు ప్రజలు అందించిన ప్రేమ, గౌరవానికి జీవితాంతం రుణపడి ఉంటానని పేర్కొన్నారు. పంజాబ్ ప్రస్తుతం మాదకద్రవ్యాల సమస్య, గ్యాంగ్‌స్టర్ల బెదిరింపులు, వసూళ్లు, అవినీతితో సతమతమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రాన్ని తిరిగి అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. స్వచ్ఛమైన రాజకీయాలు, పారదర్శక పాలన అందించేందుకు ప్రజలతో కలిసి పనిచేస్తానని తెలిపారు. తనకు వ్యక్తిగత ప్రయోజనాల కంటే పంజాబ్ అభివృద్ధే ముఖ్యమని, 'పంజాబ్ ఫస్ట్' అనేదే తన లక్ష్యమని స్పష్టం చేశారు.

మురసు ముంచేస్తుందా? ఈ జిల్లాల్లో ఎఫెక్ట్ బలంగా పడనుందా?



: ఆంధ్రప్రదేశ్ లో మురసు తుపాను ప్రభావం కనిపిస్తుంది. ఇప్పటికే అనేక జిల్లాల్లో వానలు మొదలయ్యాయి. భారీ వర్షాలతో కొన్ని ప్రాంతాలు జలమయ్యే అవకాశాలున్నాయి. మురసు తుపాను ప్రభావంతో నెల్లూరు, ప్రకాశం, గుంటూరు, కృష్ణా, పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి, విశాఖపట్నం జిల్లాలపై ప్రభావం చూపనుంది. ఇప్పటికే కొన్ని చోట్ల భారీ వర్షాలు పడుతుండటంతో పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. వాగులు వంకలు దాటే సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని కోరారు.

దూసుకొస్తున్న మురసు...

పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తీవ్ర తుపానుగా మురసు దూసుకొస్తుందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.గడచిన 6 గంటల్లో గంటకు 22 కిమీ వేగంతో కదులుతున్న మురసు తుపాను ఈ రోజు అర్ధరాత్రి తర్వాత నెల్లూరు – నరసాపురం మధ్య ఒంగోలు సమీపంలో తీరాన్ని దాటే అవకాశం ఉందని అంచనా వేసింది. ఆర్టీజీఎస్, విపత్తుల నిర్వహణ సంస్థ సమన్వయంతో నిరంతరం పర్యవేక్షణ కొనసాగుతుందని, ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ కోరారు. మురసు తుఫాన్ నేపథ్యంలో ప్రభుత్వం నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని తెలిపారు.

సీఎం, డిప్యూటీ సీఎం సమీక్షలు...

మరొకవైపు ముఖ్యమంత్రి చంద్రబాబు నిరంతరం జిల్లా కలెక్టర్లతో సమీక్షలు నిర్వహిస్తున్నారు. తీరం దాటే సమయంలో వంద నుంచి 120 కిలమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ముందస్తు హెచ్చరికలు జారీ చేయాలని చంద్రబాబు అధికారులను ఆదేశించారు. దక్షిణకోస్తా, రాయలసీమ జిల్లాల కలెక్టర్లు అన్ని జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా కలెక్టర్లు కృషి చేయాలన్న చంద్రబాబు తగిన ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు. మరొకవైపు మురసు తుపాన్‌పై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సమీక్ష నిర్వహించారు. మురసు తుపాను పట్ల అప్రమత్తతతో వ్యవహరించాలన్నారు. నెల్లూరు, ప్రకాశం, బాపట్ల, కృష్ణా జిల్లాలపై తీ తుపాను ప్ర ప్రభావం చూపనుందని, అత్యంత భారీ వర్షాల హెచ్చరికలు ఉన్న ప్రాంతాల ప్రజల్ని అప్రమత్తం చేయాలని పవన్ కల్యాణ్ కోరారు.

1300 కే ఏపీలో ధరణి రైస్

రాజమండ్రి, నవంబర్ 2, : దేశవ్యాప్తంగా ఎల్‌నినో ప్రభావంతో బహిరంగ మార్కెట్లో బియ్యంతోపాటు నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరిగాయి. గతంలో ఎప్పుడూలేని విధంగా పలు రకాలకు చెందిన బియ్యం కిలో రూ. 80 నుంచి రూ.100కు చేరింది. దీంతో పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇలాంటి సమయంలో ఏపీ ప్రభుత్వం వారికి శుభవార్త చెప్పింది.భారీగా పెరుగుతున్న బియ్యం, నిత్యావసర వస్తువుల ధరల నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం పేద, మధ్య తరగతి వర్గాలకు ఊరట కలిగించేలా రాయితీపై పలు రకాల వస్తువులను అందిస్తోంది. ఫైన్ రకం బియ్యంతోపాటు.. ఉల్లిపాయతోపాటు ఇతర కూరగాయలను రాయితీపై అందిస్తోంది. అయితే, ఏపీ సర్కార్ మరో కీలక నిర్ణయం తీసుకుంది. పేదలకు ఊరటనిచ్చే విధంగా రూ. 1300లకే ధరణి బ్రాండ్ 26కిలోల సన్నబియ్యం బస్తాను అందుబాటులోకి తీసుకొచ్చింది.రాష్ట్ర వ్యాప్తంగా పథకం అమలులో తిరుపతి జిల్లా కీలక పాత్ర పోషిస్తోంది. జిల్లాలోని రెండు ప్రధాన రైస్ మిల్లుల నుంచి తిరుపతి జిల్లాతోపాటు చిత్తూరు, అన్నమయ్య, అనంతపురం, పుట్టపర్తి, వైఎస్ఆర్ కడప, కర్నూలు, నంద్యాల మొత్తం ఎనిమిది జిల్లాలకు ధరణి బియ్యం బస్తాలను సరఫరా చేస్తున్నారు. ప్రతీరోజూ వేలాది క్వింటాళ్ల బియ్యం రైతుబజార్లు, పంపిణీ కేంద్రాలకు రవాణా అవుతోంది. తక్కువ ధరకు అందిస్తున్న 26కిలోల ధరణి బ్రాండ్ సన్న బియ్యం బస్తాలను అర్హులైన ప్రతీఒక్కరికీ పంపిణీ చేయాలనే లక్ష్యంతో ఆధార్ కార్డుతో అనుసంధానం చేశారు. బస్తాను పొందే వినియోగదారుని పేరు, ఆధార్, ఫోన్ నెంబర్లను నమోదు చేస్తున్నారు.పాస్తా ఎంచుకోండిఇదిలాఉంటే.. ఈ ధరణి బ్రాండ్ బియ్యాన్ని రైతు బజార్లలో మాత్రమే కాకుండా మొబైల్ వాహనాల ద్వారా మున్సిపాలిటీలు, మండల కేంద్రాలకు కూడా విక్రయాలను విస్తరించాలని సీఎం చంద్రబాబు నాయుడు సూచించారు. సూపర్ ఫైన్ రకం బియ్యాన్ని కిలో రూ.49, రూ.50కు విక్రయించాలని అన్నారు. మిగిలిన బియ్యం ధరలపైనా నియంత్రణ ఉండేలా చూడాలని అధికారులకు చంద్రబాబు సూచించారు. మరోవైపు బియ్యం ధరలు అదుపులో ఉండేలా మిల్లర్లు, హోల్‌సేల్ వ్యాపారులతో అధికారులు చర్చిస్తున్నారు. కొన్నిరకాల బియ్యం ధరలను తగ్గించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చే పనిలో ఉన్నారు. బీపీటీ రకం స్టీమ్ బియ్యం కేజీ రూ.66, సాధారణ స్టీమ్ బియ్యం కేజీ రూ.47కు మించకుండా విక్రయించేందుకు అంగీకరించారని అధికారులు చెబుతున్నారు.

విజయవాడ లో గెలుపుపై ఉత్కంఠ...
త్రిముఖ పోటీలో నెగ్గేదెవరు?



విజయవాడ కార్పొరేషన్ లో త్రిముఖ పోటీ నెలకొంది. నినన జరిగిన పోలింగ్ తక్కువ శాతం నమోదు కావడంతో గెలుపు ఎవరిది? అన్నది చర్చనీయాంశమయింది. ప్రస్తుతానికి ఓట్ల లెక్కింపు పూర్తి కావాల్సి ఉండటంతో గెలుపెవరిదనేది ఉత్కంఠ నెలకొంది. ముగ్గురు బలమైన అభ్యర్థులు బరిలో ఉండటంతో ఓటర్ల తీర్పు ఎవరి వైపు మొగ్గు చూపుతారన్న టెన్షన్ రాజకీయ పార్టీల్లో నెలకొంది. విజయవాడ ఓటర్లు తక్కువగా పోలింగ్ కేంద్రాలకు రావడం కూడా గెలుపోటములను ప్రభావం చేసే అవకాశాలున్నాయన్న అంచనాలు వినపడుతున్నాయి. విజయవాడ ప్రధానంగా కులం ఆధారంగా ఎన్నికలు జరుగుతుండటంతో గెలుపు ఎవరిది? అన్న చర్చ రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతుంది.

వంగవీటి వారసుడిగా...

కూటమి అభ్యర్థిగా వంగవీటి రాధాకృష్ణ బరిలో ఉన్నారు. జనసేన పార్టీ తరఫున కూటమి అధికారిక అభ్యర్థిగా గాజు గ్లాసు గుర్తుపై పోటీ చేశారు. విజయవాడ రాజకీయాల్లో బలమైన ముద్ర ఉన్న వంగవీటి మోహన రంగా వారసత్వం ఈయనకు అండగా ఉంది. విజయవాడలోని మూడు అసెంబ్లీ స్థానాల్లో కూటమి ఎమ్మెల్యేలే ఉండటం, ఎంపీ కేశినేని చిన్ని, బొండా ఉమా, గద్దె రామ్మోహన్ వంటి సీనియర్ నేతలు ప్రచారాన్ని భుజాన వేసుకోవడం ప్లస్ పాయింట్. కూటమి ఓట్లు సంపూర్ణంగా బదిలీ అయితే ఈయనకు గెలుపు అవకాశాలు మెండుగా ఉంటాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

వైసీపీ అభ్యర్థిగా...

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా రాయన భాగ్యలక్ష్మి పోటీలో ఉన్నారు. విజయవాడ ప్రస్తుత మేయర్ అయిన రాయ విజయవాడ ప్రస్తుత మేయర్ అయిన ఈమె, వైసీపీ తరఫున మళ్లీ బరిలోకి దిగారు. నగరంలో పార్టీకి ఉన్న సాంప్రదాయ ఓటు బ్యాంక్, మహిళా ఓటర్లలో ఉన్న పట్టుపై వైసీపీ నమ్మకం పెట్టుకుంది. గత ఐదేళ్ల పాలనలో తాము చేసిన పనులను చూపిస్తూ, కూటమి వ్యతిరేక ఓట్లను చీల్చకుండా తమ వైపు తిప్పుకోవాలని వ్యూహాత్మకంగా ప్రచారం నిర్వహించారు.

స్వతంత్ర అభ్యర్థిగా...

ఇండియా కూటమి మద్దతుదారుగా ఏబీ వెంకటేశ్వరరావు స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచారు. రిటైర్డ్ సీనియర్ ఐపీఎస్ అధికారి, మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్ అయిన ఏబీ వెంకటేశ్వరరావు స్వతంత్రంగా బరిలోకి దిగగా, కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం పార్టీలు ఈయనకు మద్దతు ప్రకటించాయి.ఈయన ఎంట్రీతో విజయవాడ కార్పొరేషన్ పోరు ఆసక్తికరమైన త్రిముఖ చదరంగంగా మారింది. నగరంలో ఆస్తి పన్ను పెంపు, ఖాళీ స్థలాల పన్ను రద్దు వంటి స్థానిక పౌర సమస్యలపై స్పష్టమైన అజెండాతో ప్రచారం చేసి, విద్యావంతులు, తటస్థ ఓటర్లను ఆకర్షించే ప్రయత్నం చేశారు.

గెలుపు అవకాశాలు ఎవరివి?

రాజకీయ విశ్లేషణల ప్రకారం, నగరంలోని 86 డివిజన్లలో ఎక్కువ చోట్ల అధికార కూటమికి స్పష్టమైన సానుకూలత కనిపిస్తోందని ప్రాథమిక అంచనాలు చెబుతున్నాయి. అయితే ఏబీ వెంకటేశ్వరరావు చీల్చే ఓట్లు, అలాగే వైసీపీ సాంప్రదాయ ఓటు బ్యాంక్ ఏ మేరకు నిలబడుతుందనే అంశాలపైనే మేయర్ పీఠం ఎవరికి దక్కుతుందనేది ఆధారపడి ఉంటుంది. రేపు ఫలితాలు వెలువడేంత వరకూ గెలుపుపై అంచనాలు మాత్రం ఊహాగానాలుగా చెప్పాలి.

జెన్ జీకి అనుకూలంగా విజయసాయి అడుగులు

నెల్లూరు, నవంబర్ 2, : విజయసాయిరెడ్డి పార్టీ ఉద్దేశాలు.. విధివిధానాలను ఆయన అప్పుడప్పుడు సినిమా టీజర్ లాగా విడుదల చేస్తున్నారు.విజయ సాయి రెడ్డి ప్రజలను కాకుండా.. సామాజిక మాధ్యమాలను నమ్ముకున్నారు. తన పార్టీ గురించి.. విధివిధానాల గురించి ఇప్పటివరకు కొన్ని విషయాలు మాత్రమే చెప్పారు. ఇప్పుడు వాటిని బహిరంగంగా బయటపెట్టే క్రమంలో రీల్స్ ను ఉపయోగిస్తున్నారు. జన్ జడ్ మీద పూర్తిగా దృష్టి సారించిన ఆయన.. వారిని ఆకట్టుకునేందుకు రీల్స్ మాత్రమే మార్గమని భావించారు. అందువల్లే రియల్ టైం నుంచి రీల్స్ టైం లోకి వచ్చేసారు.ఒకప్పుడు విజయసాయిరెడ్డి వైసీపీలో కీలక నాయకుడిగా ఉండేవారు. జగన్ కు దగ్గరగా ఉండేవారు. అయితే ఇప్పుడు ఆ పార్టీ నుంచి బయటికి వచ్చిన తర్వాత సొంత రాజకీయ వేదికను ఏర్పాటు చేసుకుని పనులు నిమగ్నమయ్యారు. అయితే ఆయన రాజకీయాల్లోకి తిరిగి వచ్చిన తీరు.. ప్రజల్లోకి వెళ్లాలి అనుకుంటున్నా ప్రచార పద్ధతులు ఇప్పుడు పూర్తిగా ఆసక్తికరంగా మారాయి. ముఖ్యంగా సోషల్ మీడియా రీల్స్ ద్వారా తన రాజకీయ ఆలోచనలను ఆయన ప్రజల్లోకి తీసుకువెళ్లే ప్రయత్నం చేస్తున్నారు.విజయసాయిరెడ్డి గతంలో రాజ్యసభ సభ్యుడిగా.. వైసిపి జాతీయ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. 2025 జనవరిలో రాజ్యసభ సభ్యత్వానికి.. వైసిపి ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా.. క్రియాశీలమైన రాజకీయాలకు దూరంగా ఉంటారని ప్రకటించారు. అయితే ఆ విరామం ఎక్కువ కాలం కొనసాగలేదు. సరిగా ఈ ఏడాది ఆగస్టులో తిరిగి రాజకీయాల్లోకి వస్తున్నట్టు ఆయన ప్రకటించారు. ప్రజల గొంతుకను.. అసెంబ్లీ.. పార్లమెంట్లో వినిపించేందుకు కొత్త పార్టీ ఏర్పాటు చేస్తానని ఆయన వెల్లడించారు.ఏపీ రాజకీయాల్లో కొత్త పార్టీలు రావడం కొత్తేమీ కాదు. కానీ మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి రాజకీయాల్లోకి తిరిగి వస్తున్న తీరు మాత్రం ఆసక్తిని కలిగిస్తోంది. ఒకప్పుడు వైసిపి కీలక వ్యూహకర్తగా వ్యవహరించిన ఆయన ఇప్పుడు కొత్త పార్టీ ఏర్పాటు అడుగులు వేస్తున్నారు. అయితే ఈసారి ఆయన రాజకీయ ప్రచారంలో సోషల్ మీడియాకు.. ముఖ్యంగా డిజిటల్ మీడియాకు విపరీతమైన ప్రాధాన్యం ఇస్తున్నారు. రాజకీయాలు మారిపోతున్నాయా.. రాజకీయ ప్రచారం రీల్స్ స్థాయికి చేరుతోందా అరే చర్చ కూడా మొదలైంది. విజయ్ సాయి రెడ్డి గతంలో జగన్ కు అత్యంత సన్నిహితంగా వ్యవహరించారు. వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో పార్టీ వ్యవహారాలలో కీలక పాత్ర పోషించారు. రాజ్యసభ సభ్యుడిగా పని చేశారు. అయితే 2025 జనవరిలో ఊహించని విధంగా రాజ్యసభ సభ్యత్వానికి.. వైసీపీకి రాజీనామా చేశారు. ఇకపై రాజకీయాలకు దూరంగా ఉంటారని సంకేతాలు కూడా ఇచ్చారు. కానీ 2020లో మళ్ళీ తన రాజకీయ భవిష్యత్తుపై కీలకమైన ప్రకటనలు చేస్తూ.. సంచలనానికి కారణమయ్యారు.తన రాజకీయ ప్రస్థానంలో కొత్త అధ్యయాన్ని ప్రారంభించాలని విజయ సాయి రెడ్డి అనుకున్నారు. టిడిపి.. వైసిపి వంటి పార్టీలకు ప్రత్యామ్నాయంగా కొత్త రాజకీయ వేదికను ఏర్పాటు చేస్తానని ప్రకటించారు. ప్రజల సమస్యలను అసెంబ్లీ.. పార్లమెంట్ లో వినిపించడమే తన లక్ష్యమని చెప్పారు. తన పార్టీలో యువతకు పెద్దపీట వేస్తానని కూడా వెల్లడించారు. 40 సంవత్సరాల వారికి పార్టీలో అవకాశాల్లో 66% ప్రాధాన్యం ఇస్తామని పేర్కొన్నారు. ప్రతి జనవరి 1న ఉద్యోగ క్యాలెండర్ ప్రకటించడం.. ఉద్యోగం వచ్చేవరకు నిరుద్యోగులకు నెలకు పదివేల భృతి ఇచ్చే ప్రతిపాదనను ప్రస్తావించారు..కొత్త పార్టీ ఏర్పాటుకు విజయసాయిరెడ్డి ముహూర్తాన్ని కూడా ప్రకటించారు.
నవంబర్ 11న ఉదయం 11 గంటల 11 నిమిషాలకు విజయవాడలోని ఏ కన్వెన్షన్ సెంటర్లో పార్టీ పేరు ప్రకటిస్తానని అక్టోబర్ 20న ఆయన వెల్లడించారు. దీంతో విజయసాయిరెడ్డి కొత్త పార్టీ రాక మీద చర్చ మొదలైంది. ఇప్పటి రాజకీయాల్లో సభలు, సమావేశాలు, ప్రెస్ మీట్లు మాత్రమే సరిపోవడం లేదు.. సోషల్ మీడియా ద్వారా ప్రజలకు వెళ్లడం కూడా ముఖ్యమైనదని.. ముఖ్యంగా యూట్యూబ్ షార్ట్స్..ఇన్ స్టా గ్రామ్ రీల్స్, ఫేస్ బుక్ వీడియో ద్వారా తన ప్రసంగాలను ప్రజలకు తీసుకెళ్లాలని విజయసాయిరెడ్డి భావిస్తున్నారు.

మరో వాయిగండం...

విశాఖపట్టణం, నవంబర్ 2, :
బంగాళాఖాతంలో ఏర్పడిన మురసు తుపాను వేగంగా ముందుకు కదులుతుండటంతో ఆంధ్రప్రదేశ్‌లోని తీర ప్రాంతాల్లో ఆందోళన మొదలైంది. ఇప్పటికే అర్నబ్ తుపాను ప్రభావంతో జరిగిన నష్టం నుంచి పూర్తిగా కోలుకోకముందే మరో తుపాను ముప్పు పొంచి ఉండటం ప్రజలను కలవరపెడుతోంది. ముఖ్యంగా దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాలకు వాతావరణశాఖ భారీ వర్షాల హెచ్చరికలు జారీ చేయడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమవుతోంది.బంగాళాఖాతంలో ఏర్పడిన మురసు తుపాను గత ఆరు గంటల్లో గంటకు 23 కిలోమీటర్ల వేగంతో కదులుతోంది. ప్రస్తుతం చెన్నైకి 560 కిలోమీటర్లు, విశాఖపట్నానికి 660 కిలోమీటర్లు, మచిలీపట్నానికి 640 కిలోమీటర్లు, నెల్లూరుకు 630 కిలోమీటర్లు, ఒంగోలుకు 680 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. తుపాను కదలికలను వాతావరణశాఖ నిశితంగా పరిశీలిస్తోంది. రేపు ఉదయానికి పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఇది తీవ్ర తుపానుగా బలపడే అవకాశం ఉందని అంచనా వేస్తోంది.మురసు తుపాను తీరం దాటే సమయంపై వాతావరణశాఖ అంచనాలు ఆసక్తికరంగా మారాయి. సోమవారం అర్ధరాత్రి లేదా ఎల్లుండి తెల్లవారుజామున నెల్లూరు నుంచి నరసాపురం మధ్య తీరాన్ని దాటే అవకాశం ఉందని భావిస్తున్నారు. తుపాను తీరం దాటే సమయంలో బలమైన ఈదురుగాలులు, భారీ వర్షాలు నమోదయ్యే ప్రమాదం ఉండటంతో తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది.ముఖ్యంగా సముద్ర తీరానికి సమీపంలో నివసించే మత్స్యకార కుటుంబాలు, లోతట్టు ప్రాంతాల ప్రజలు అధికారుల సూచనలను తప్పనిసరిగా



పాటించాలని సూచిస్తున్నారు. ఇప్పటికే మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లవద్దని హెచ్చరికలు జారీ చేశారు.తుపాను ప్రభావం కేవలం తీర ప్రాంతాలకే పరిమితం కాకుండా రాష్ట్రంలోని పలు జిల్లాలపై ఉండనుంది. మరో మూడు రోజుల పాటు దక్షిణ కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని విపత్తుల నిర్వహణ సంస్థ అంచనా వేస్తోంది. భారీ వర్షాలతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యే పరిస్థితులు ఏర్పడవచ్చని, వాగులు, వంకలు పొంగిపొర్లే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.ఈ నేపథ్యంలో ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లకూడదని, చెట్ల కింద, విద్యుత్ స్తంభాల సమీపంలో ఉండకూడదని అధికారులు సూచిస్తున్నారు. వర్షాల సమయంలో వరద నీటితో నిండిన రహదారులను దాటేందుకు ప్రయత్నించవద్దని చెబుతున్నారు.మురసు తుపాను నేపథ్యంలో ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ

ప్రఖర్ జైన్ సూచించారు. వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనించాలని, అధికారుల నుంచి వచ్చే హెచ్చరికలను పాటించాలని కోరారు. అవసరమైన మందులు, తాగునీరు, అత్యవసర వస్తువులను అందుబాటులో ఉంచుకోవాలని సూచిస్తున్నారు.మురసు తుపాను గమనం, తీవ్రత, తీరం దాటే ప్రాంతంపై స్పష్టత వచ్చే కొద్దీ ఏపీ యంత్రాంగం అప్రమత్తతను మరింత పెంచాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. తుపాను ప్రభావం ఎంత మేర ఉంటుందనేది రాబోయే 24 గంటల్లో కీలకం కానుంది. ప్రజలు భయాందోళనలకు గురికాకుండా అప్రమత్తంగా ఉండటం, అధికారుల సూచనలను పాటించడం అత్యంత అవసరం.

తీవ్ర తుపానుగా మురసు..
ఏపీ తీరానికి రెడ్ అలర్ట్

నెల్లూరు :
పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన 'మురసు' తుపాను, తీవ్ర తుపానుగా బలపడింది. ఇది నేటి అర్ధరాత్రి నుంచి రేపు (3వ తేదీ) తెల్లవారుజాము లోపు నెల్లూరు – నర్సాపురం మధ్య, ప్రధానంగా ఒంగోలు సమీపంలో తీరం దాటే అవకాశం ఉందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. సోమవారం ఉదయం నాటికి ఈ తుపాను ఒంగోలుకు 330 కి.మీ, నెల్లూరుకు 290 కి.మీ దూరంలో కేంద్రీకృతమై ఉందని ఏపీఎస్‌డీఎంఏ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. తీరం దాటే సమయంలో గంటకు 100 నుంచి 110 కిలోమీటర్ల వేగంతో పెనుగాలులు వీస్తాయని, ఇవి గరిష్ఠంగా 120 కిలోమీటర్ల వేగాన్ని కూడా అందుకోవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. తుపాను ప్రభావంతో దక్షిణ కోస్తా ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో నెల్లూరు, ప్రకాశం, గుంటూరు, బాపట్ల, కృష్ణా జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేశారు. ముఖ్యంగా బాపట్ల, కృష్ణా, ప్రకాశం జిల్లాల తీర ప్రాంతాల్లో 1.0 నుంచి 1.5 మీటర్ల ఎత్తున సముద్రపు అలలు (స్టార్మ్ సర్జ్) ఎగిసిపడే ప్రమాదం ఉందని ఏపీఎస్‌డీఎంఏ తెలిపింది. ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లకూడదని అధికారులు స్పష్టం చేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు.

సంపాదకీయం


అస్తిత్వ సంక్షోభం!

ఒక వ్యక్తి తన జీవితాన్ని, ఉనికిని, ప్రయాణాన్ని ప్రశ్నించుకునే పరిస్థితే తాత్విక పరిభాషలో 'అస్తిత్వ సంక్షోభం'. తాను ఎందుకు జీవిస్తున్నాడు? జీవితానికి ఒక లక్ష్యముందా? నిర్ణయాలు సరైనవేనా? కోరుకున్న జీవితాన్ని పొందగలుగుతున్నాడా? అనే ప్రశ్నలు ఒక దశలో ప్రతి మనిషినీ వెంటాడుతుంటాయి. అయితే ఈ సంక్షోభం వ్యక్తులకే పరిమితం కాదు. దేశం కూడా ఇలాంటి పరిస్థితినే ఎదుర్కోవచ్చు. అభివృద్ధి పథంలో దూసుకుపోతున్నామని చెప్పుకుంటున్నా ప్రజాకాంక్షలు నెరవేరనప్పుడు, ప్రజాస్వామ్య విలువలు ప్రశ్నార్థకమైనప్పుడు, పాలకులపై ప్రజలకు విశ్వాసం సన్నగిల్లినప్పుడు దేశం కూడా అస్తిత్వ సంక్షోభంలో పడుతుంది. భారత పరిస్థితులను ఈ కోణంలో పరిశీలించాల్సిన తరుణమిది. ప్రపంచంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా భారత్ గుర్తింపు పొందుతోంది. అంతరిక్ష పరిశోధనలు, సాంకేతిక పరిజ్ఞానం, డిజిటల్ సేవలు, మౌలిక సదుపాయాల కల్పనవంటి రంగాల్లో గణనీయమైన పురోగతి సాధిస్తోంది. అదే సమయంలో సంపద కొద్దిమంది చేతుల్లోనే కేంద్రీకృతమవుతున్న వాస్తవాన్ని విస్మరించలేం. హురున్ గ్లోబల్ రిచ్ లిస్ట్ 2025 ప్రకారం భారత్‌లో 284 మంది బిలియనీర్లు ఉండగా, ప్రపంచంలో మూడోస్థానంలో నిలిచింది. మరోవైపు ప్రపంచ బ్యాంకు 2025 అంచనాల ప్రకారం రోజుకు 3 డాలర్ల అంతర్జాతీయ దారిద్ర్య రేఖ కింద ఉన్న భారతీయుల శాతం 2022-23లో 5.3 శాతానికి తగ్గింది. సంక్షేమ పథకాలు, ఆహార భద్రత, గృహ నిర్మాణం, తాగునీరు, పారిశుధ్యం కార్యక్రమాలు ఈ పురోగతికి దోహదపడ్డాయి. అయినప్పటికీ పేదరికం, నిరుద్యోగం, ఆర్థిక అసమానతలు ఇంకా సవాళ్లే. సంపద పెరుగుతున్నంత మాత్రాన ప్రతి పౌరుడి జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్నాయని భావించలేం. అభివృద్ధి ఫలాలు అట్టడుగు వర్గాలకు చేరుతున్నాయా? నాణ్యమైన విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు అందుబాటులో ఉన్నాయా? అనే ప్రశ్నలకు ప్రభుత్వాలు సమాధానం చెప్పాలి.

దేశంలో అవినీతి, నిరుద్యోగం, ప్రభుత్వ వ్యవస్థల్లో జవాబుదారీతనం లోపించడం, పరీక్షల ప్రశ్నపత్రాల లీకేజీలు, ఎన్నికల ప్రక్రియపై అనుమానాలు ప్రజల్లో అసంతృప్తిని పెంచుతున్నాయి. అవినీతి అనేది ఏ ఒక్క ప్రభుత్వానికో, రాజకీయ పార్టీకో పరిమితమైన సమస్య కాదు. దశాబ్దాలుగా వ్యవస్థలో వేళ్లూనుకున్న ఈ జాడ్యాన్ని నిర్మూలించాల్సిన బాధ్యత పాలకులతోపాటు సమాజంపైనా ఉంది. అయితే అవినీతిని వ్యవస్థలో భాగంగా అంగీకరించి, సాధారణ విషయంగా తీసుకోవడం ప్రమాదకరం. ప్రజల హక్కులను కాపాడాల్సిన సంస్థలే ప్రశ్నార్థకమైతే ప్రజాస్వామ్యంపై విశ్వాసం దెబ్బతింటుంది. ప్రభుత్వ జవాబుదారీతనం, పారదర్శకతను డిమాండ్ చేస్తూ ముందుకొస్తున్న ఉద్యమాలు ఈ నేపథ్యంలో ప్రాధాన్యత సంతరించుకుంటున్నాయి. సీజేపీ ఉద్యమం ఇందుకు ప్రతిరూపం. ప్రజల జీవితాలను ప్రభావితం చేసే నిర్ణయాల్లో తమకు భాగస్వామ్యం ఉండాలని, పాలకులు తమ చర్యలకు సమాధానం చెప్పాలని పౌరులు కోరుకుంటున్నారు. ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భారీ సంఖ్యలో పేర్లు తొలగించడంపై వ్యక్తమైన ఆందోళనలు, ప్రశ్నపత్రాల లీకేజీలకు వ్యతిరేకంగా విద్యార్థుల నిరసనలు ఈ అసంతృప్తికి ఉదాహరణలు. ఒకప్పుడు ఉమ్మడి కుటుంబ వ్యవస్థ, సామాజిక సంప్రదాయాలు వ్యక్తులకు భద్రత కల్పించేవి. ఇప్పుడు అవి మారుతున్నా, వాటి స్థానంలో కొత్త సామాజిక భద్రతా వ్యవస్థలు పూర్తిస్థాయిలో ఏర్పడలేదు. ఫలితంగా స్వేచ్ఛతోపాటు ఒంటరితనం, అభద్రత, ఆర్థిక ఒత్తిడి కూడా పెరుగుతున్నాయి. వ్యక్తిగత అసంతృప్తి, సామాజిక అస్థిరత, రాజకీయ నిరాశ ఒకదానితో మరొకటి ముడిపడుతున్నాయి. ప్రజలు ప్రభుత్వాలను ప్రశ్నించడం, తమ హక్కుల కోసం ఉద్యమించడం ప్రజాస్వామ్యానికి ముప్పు కాదు. వాటి అణచివేతే విరుద్ధం. విమర్శలను దేశ వ్యతిరేకతగా చిత్రీకరించడం పాలకులకు తగదు.

ఎక్కడినుంచి బయలుదేరాం? ఎక్కడికి చేరాం? ఎటు ప్రయాణిస్తున్నాం? అంటూ వ్యక్తుల మాదిరిగానే.. దేశాలు సైతం తమ ప్రయాణాన్ని సమీక్షించుకోవడం ముఖ్యం. మానసిక వైద్య నిపుణుడు రాబర్ట్ బట్లర్ అభివృద్ధి చేసిన 'లైఫ్ రివ్యూ థెరపీ'లో ఈ ఆత్మపరిశీలనకు ప్రాధాన్యత ఉంటుంది. గత అనుభవాలను కేవలం గుర్తు చేసుకోవడం కాకుండా, వాటి నుంచి అర్థాన్ని గ్రహించి, పరిష్కారం కాని సమస్యలను ఎదుర్కొని, భవిష్యత్తుకు స్పష్టమైన దిశను నిర్ణయించుకోవడం దీని ఉద్దేశం. ఇదే సూత్రాన్ని దేశ పాలనకు కూడా అన్వయించుకోవాలి. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి సాధించిన విజయాలను గుర్తించడంతోపాటు, పరిష్కారం కాని సమస్యలను కూడా నిజాయితీగా అంగీకరించాలి. అభివృద్ధి అంటే కేవలం జీడీపీ పెరుగుదల కాదు. పౌరుడికి గౌరవప్రదమైన జీవితం, నాణ్యమైన విద్య, అందుబాటులో వైద్యం, ఉపాధి, సమాన అవకాశాలు, భావప్రకటనా స్వేచ్ఛ కల్పించగలగడం కూడా అభివృద్ధిలో భాగమే. ప్రజాస్వామ్యం అంటే ఐదేళ్లకోసారి ఓటు వేయడం మాత్రమే కాదు. ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు, నిరసన తెలిపే స్వేచ్ఛ, పాలనలో పారదర్శకత కోరే అధికారం కూడా దాని పునాదులే. ఫ్రీడమ్ హౌస్ వంటి అంతర్జాతీయ సంస్థలు భారత పౌర స్వేచ్ఛలు, ప్రజాస్వామ్య పరిస్థితులపై వ్యక్తం చేస్తున్న ఆందోళనలను కూడా ఆత్మపరిశీలనకు అవకాశంగా చూడాలి. అదే సమయంలో పౌరులు తమ హక్కులతోపాటు బాధ్యతలనూ గుర్తించాలి. కుటుంబాలు, విద్యాసంస్థలు, మీడియా, రాజకీయ వ్యవస్థలు ప్రశ్నించే తత్వాన్ని ప్రోత్సహించాలి. తప్పులను అంగీకరించే సంస్కృతి, భిన్నాభిప్రాయాలను గౌరవించే లక్షణం, అధికారాన్ని ప్రశ్నించే ధైర్యం సమాజంలో పెరగాలి. ప్రస్తుతం దేశంలో వ్యక్తమవుతున్న నిరసనలు కేవలం కొన్ని సమస్యల పరిష్కారం కోసం జరుగుతున్న ఆందోళనలు మాత్రమే కావు. ప్రజలు తమ ఉనికిని, హక్కులను, భవిష్యత్తును తిరిగి నిర్వచించుకోవాలనే ప్రయత్నంగా కూడా వాటిని చూడాలి. ప్రభుత్వం తన పాలనను సమీక్షించుకోవాలి. రాజకీయ పార్టీలు తమ బాధ్యతలను గుర్తించాలి. పౌరులు కూడా సమాజ మార్పులో భాగస్వాములు కావాలి. భారత్ ఎదుర్కొంటున్నది కేవలం ఆర్థిక లేదా రాజకీయ సంక్షోభం కాదు. అభివృద్ధి దిశ, ప్రజాస్వామ్య విలువలు, వ్యక్తిగత స్వేచ్ఛ, సామాజిక న్యాయం విషయంలో మనం ఎటు పయనిస్తున్నామనే మౌలిక ప్రశ్న. ఈ ప్రశ్నలకు సమాధానాలు వెతకాల్సిన సమయం ఆసన్నమైంది. ఆత్మస్తుతి కాదు.. ఆత్మపరిశీలనే దేశానికి ఇప్పుడు అవసరం. అస్తిత్వ సంక్షోభాన్ని అధిగమించడానికి మార్పు దిశగా అడుగులు వేయాల్సిన తరుణం ఇదే!

పనికొచ్చే పలుకు



సంతోషం తగ్గకూడదు.. సంపాదన పెరగాలి!

జీవితంలో ప్రతి ఒక్కరికీ మంచి ఇల్లుండాలి. ఖరీదైన కారు నడపాలి. లేటెస్ట్ గ్యాడ్జెట్స్ వాడాలి. విలాసవంతమైన జీవితం గడపాలి -అనే కోరికలు సహజం. సాధించడానికి కష్టపడటంలోనూ తప్పులేదు. కానీ ఇక్కడే ఒక చిన్న ప్రశ్న. మనం డబ్బు సంపాదిస్తున్నది జీవితాన్ని సంతోషంగా గడపడం కోసమా? లేక సంపాదించిన డబ్బుతో కొనుగోలు చేసిన వస్తువుల కోసం జీవితమంతా కష్టపడటానికా? చాలామంది ఈ రెండింటి మధ్య తేడాను గుర్తించలేకపోతున్నారు. ఒకప్పుడు సౌకర్యం కోసం ఇల్లు కొనుగోలు చేస్తారు. తర్వాత పెద్ద ఇల్లు కావాలనుకుంటారు. దాన్ని అలంకరించడానికి ఖరీదైన ఫర్నిచర్, ఆధునిక హంగులు, విలాసవంతమైన వస్తువులు సమకూర్చుకుంటారు. కారు కొంటే సరిపోదు.. మరింత ఖరీదైన మోడల్ కావాలి. ఫోన్ కొంటే ఏడాది తిరక్కుండానే కొత్త మోడల్‌పై మనసు పడుతుంది. ఇలా అవసరాలు క్రమంగా కోరికలుగా, కోరికలు వ్యామోహాలుగా మారిపోతాయి. చివరకు మనిషి సంపాదనలో ఎక్కువ భాగం ఈ వస్తువుల నిర్వహణకే ఖర్చవుతుంది. ఇంటి ఈఎంఐలు, కారు లోన్లు, ఇన్సూరెన్స్, మెయింటెనెన్స్, విద్యుత్ బిల్లులు, ఇతర ఖర్చులు కలిసి ఆర్థిక భారంగా మారతాయి. వాటిని కొనుగోలు చేసినప్పుడు కలిగిన ఆనందం కొద్దిరోజులకే పరిమితమవుతుంది. కానీ వాటి కోసం చేయాల్సిన చెల్లింపులు మాత్రం ఏళ్ల తరబడి కొనసాగుతాయి. అంటే మనం సౌకర్యాలను కొనుగోలు చేస్తున్నామనుకుంటాం. వాస్తవానికి వాటిని నిర్వహించడానికి మన సమయాన్ని, స్వేచ్ఛను, ప్రశాంతతను ఖర్చు చేస్తున్నామన్నమాట!

సోషల్ మీడియా ప్రపంచంలో ఇతరుల జీవనశైలిని చూస్తూ మన జీవితాన్ని పోల్చుకోవడం సాధారణమైపోయింది. ఎవరో విదేశీ పర్యటనకు వెళ్లారని, మరొకరు కొత్త కారు కొన్నారని, ఇంకొకరు విలాసవంతమైన ఇంట్లో ఉంటున్నారని మనమూ అలాంటి జీవితాన్ని కోరుకుంటాం. కానీ సోషల్ మీడియాలో కనిపించేది వారి జీవితంలోని మెరిసే వైపు మాత్రమే. ఆ జీవనశైలి వెనుక ఉన్న అప్పులు, ఆర్థిక ఒత్తిళ్లు, బాధ్యతలు కనిపించవు. అందుకే ఇతరుల విజయాలను చూసి మన అవసరాలను నిర్ణయించుకోవడం తెలివైన పని కాదు. నిజమైన లగ్జరీ అంటే ఖరీదైన కారు కాదు.. అవసరమైనప్పుడు సెలవు తీసుకునే స్వేచ్ఛ. పెద్ద ఇల్లు కాదు.. ఇంటికి తిరిగొచ్చినప్పుడు ప్రశాంతంగా ఉండగలిగే మనసు. బ్యాంకు ఖాతాలో భారీ మొత్తం ఉండటమే కాదు.. అనుకోని సమస్య వచ్చినా భయపడకుండా ఎదుర్కొనే ఆర్థిక భద్రత. ఖరీదైన వస్తువులు కలిగి ఉండటం కంటే వాటి కోసం అప్పుల ఊబిలో చిక్కుకోకుండా ఉండటం గొప్ప విషయం. అందుకే ప్రతి కొనుగోలుకు ముందు ఒకసారి ఆలోచించాలి. ఇది నిజంగా అవసరమా? దీని నిర్వహణ ఖర్చును భరించగలనా? దీని కోసం నా స్వేచ్ఛను తాకట్టు పెట్టాల్సి వస్తుందా? అనే ప్రశ్నలు వేసుకోవాలి. సంపాదన పెరిగిన ప్రతిసారీ ఖర్చులనూ పెంచుకోవాల్సిన అవసరం లేదు. కొంత మొత్తాన్ని పొదుపు చేయడం, అత్యవసర నిధిని ఏర్పాటు చేసుకోవడం, అప్పులను నియంత్రించడం, అనుభవాలకు ప్రాధాన్యత ఇవ్వడం అలవాటు చేసుకోవాలి. జీవితం అనేది వస్తువులను కూడబెట్టుకునే పోటీ కాదు. మనకు నచ్చిన పనులు చేసుకుంటూ, ఇష్టమైన వారితో సమయం గడుపుతూ, ఆరోగ్యంగా, ప్రశాంతంగా జీవించడమే అసలైన విజయం. మనం ఉపయోగించాల్సిన వస్తువులకు బానిసలుగా మారకూడదు. డబ్బు మన జీవితాన్ని సులభతరం చేయాలి కానీ, దాని కోసం జీవితాన్నే కష్టతరం చేసుకోకూడదు. సంపాదించండి.. ఆనందించండి.. భవిష్యత్తు కోసం పొదుపు చేయండి. కానీ సంపాదన అంతా ఖర్చులకే సరిపోతూ, మన కోసం మనకు సమయం మిగలని పరిస్థితిని మాత్రం తెచ్చుకోవద్దు. వస్తువుల కోసం మనం కాదు.. మన కోసం వస్తువులుండాలి!

ఏపీకి తీరని 'తుపాను' కష్టాలు!?




ఆంధ్రప్రదేశ్‌కు ప్రకృతి పరీక్షలు కొనసాగుతూనే ఉన్నాయి. ఒకవైపు ఆర్నబ్ తుపాను సృష్టించిన బీభత్సం నుంచి తీరప్రాంత ప్రజలు, రైతులు ఇప్పుడిప్పుడే కోలుకుంటుండగా.. మరోవైపు మురసు తీవ్ర తుపాను ముప్పు ముంచుకొచ్చింది. ఒక తుపాను ప్రభావం పూర్తిగా తొలగకముందే మరో తుపాను విరుచుకుపడే పరిస్థితి రాష్ట్ర ప్రజలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. ముఖ్యంగా దక్షిణ కోస్తా జిల్లాలపై మురసు ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికలు పరిస్థితి తీవ్రతను తెలియజేస్తున్నాయి. పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తీవ్ర తుపానుగా మారిన మురసు నవంబరు 2 ఉదయం నాటికి గంటకు సుమారు 22నుంచి 25 కిలోమీటర్ల వేగంతో వాయవ్య దిశగా కదులుతోంది. భారత వాతావరణ శాఖ తాజా బులెటిన్ ప్రకారం (సోమవారం సాయంత్రం 4 గంటలకు) నెల్లూరుకు తూర్పు ఆగ్నేయంగా సుమారు 210 కిలోమీటర్లు, చెన్నైకి తూర్పు ఈశాన్యంగా 200 కిలోమీటర్ల దూరంలో తుపాను కేంద్రీకృతమై ఉంది. నెల్లూరు నుంచి నర్సాపురం మధ్య, ఒంగోలు సమీపంలో నవంబరు 2 అర్ధరాత్రి నుంచి నవంబరు 3 తెల్లవారుజామున నాలుగు గంటల మధ్య తీరం దాటే అవకాశం ఉంది. తీరం దాటే సమయంలో గంటకు 100 నుంచి 110 కిలోమీటర్ల వేగంతో, గరిష్ఠంగా 120 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీచే ప్రమాదముంది. తుపాను ప్రభావం దక్షిణ కోస్తాపైనే కాకుండా ఉత్తరాంధ్రలోనూ గాలుల రూపంలో కనిపించే అవకాశం ఉంది. సముద్రం అల్లకల్లోలంగా మారినప్పుడు చిన్న బోట్లు మాత్రమే కాకుండా భారీ నౌకలు సైతం గాలుల దిశకు కొట్టుకుపోయే ప్రమాదముంటుంది. గతంలో విశాఖ తెన్నేటి పార్కు సమీపంలో బంగ్లాదేశ్ నౌక తీరానికి కొట్టుకొచ్చిన ఘటన ఈ ప్రమాదాలకు నిదర్శనం. అందువల్ల మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లకుండా ఉండటం, ఇప్పటికే వేటకు వెళ్లిన వారు సురక్షితంగా తీరానికి చేరుకునేలా చర్యలు తీసుకోవడం అత్యంత కీలకం. తుపాను హెచ్చరికలను తేలికగా తీసుకుంటే ప్రాణ, ఆస్తి నష్టాలు సంభవించే ప్రమాదముంది.

మురసు తుపాను ప్రభావంతో నెల్లూరు, ప్రకాశం, బాపట్ల, గుంటూరు, కృష్ణా జిల్లాలతోపాటు దక్షిణ కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో భారీనుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరించింది. కొన్ని ప్రాంతాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే ప్రమాదముంది. ఏలూరు, ఎన్టీఆర్, పల్నాడు, ఉభయ గోదావరి జిల్లాలు, తిరుపతి, చిత్తూరు ప్రాంతాల్లోనూ వర్షాల తీవ్రత ఉండవచ్చు. ఉత్తరాంధ్ర జిల్లాల్లోనూ వర్షాలు, బలమైన గాలుల ప్రభావం కనిపిస్తోంది. తుపాను ప్రభావం తెలంగాణలోనూ ఉండనుంది. ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబ్‌నగర్ తదితర జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఇప్పటికే తీరప్రాంతాల్లో వర్షాలు ప్రారంభమయ్యాయి. కృష్ణపట్నం పోర్టులో మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేయడం పరిస్థితి తీవ్రతను సూచిస్తోంది. నెల్లూరు జిల్లాలో విద్యాసంస్థలకు సెలవు ప్రకటించడం, తీరప్రాంత ప్రజలను అప్రమత్తం చేయడంవంటి చర్యలు ప్రారంభమయ్యాయి. సహాయక చర్యల కోసం ఆరు ఎన్డీఆర్ఎఫ్, ఏడు ఎస్డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచడం ముందస్తు సన్నద్ధతలో భాగం. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయడం, అవసరమైన చోట అదనపు సిబ్బందిని అందుబాటులో ఉంచడం కూడా అవసరం. రైలు, విమాన సర్వీసులపైనా తుపాను ప్రభావం పడుతోంది. ఇప్పటికే పలు రైళ్లను రద్దు చేయడం, మరికొన్నింటిని దారి మళ్లించడం జరిగింది. చెన్నై నుంచి విజయవాడ, రాజమండ్రి, కడప తదితర ప్రాంతాలకు వచ్చే కొన్ని విమాన సర్వీసులు కూడా రద్దయ్యాయి. విజయవాడ, రాజమండ్రి, తిరుపతి విమానాశ్రయాల కార్యకలాపాలకు అంతరాయం కలిగే అవకాశం ఉంది. విపత్తులో మరో ముఖ్యమైన అంశం వ్యవసాయం. ఆర్నబ్ తుపాను ప్రభావంతో ఇప్పటికే కృష్ణా జిల్లాలో వరితోపాటు మినుము, వేరుశనగ, పత్తి, చెరకు, ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లింది. ముంపు నుంచి బయటపడేందుకు ప్రయత్నిస్తున్న రైతులకు మురసు ముప్పు మరింత ఆందోళన కలిగిస్తోంది. కోతకు సిద్ధంగా ఉన్న వరి, పొలాల్లో ఉన్న ఇతర పంటలకు భారీ వర్షాలు తీవ్ర నష్టం కలిగించవచ్చు. పంటలు నేలకొరిగితే దిగుబడిపై ప్రభావం పడుతుంది. నీరు నిలిచిపోతే వేర్లు కుళ్లిపోయి పంట పూర్తిగా దెబ్బతినే ప్రమాదం ఉంది. రైతులకు ముందస్తు హెచ్చరికలు అందించడం, పంట ఉత్పత్తులను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు సహకరించడం, నష్టం వాటిల్లిన వెంటనే అంచనాలు వేయడం ప్రభుత్వ యంత్రాంగం బాధ్యత.

తుపాన్లను పూర్తిగా నివారించడం మన చేతుల్లో లేకపోయినా, వాటివల్ల కలిగే నష్టాన్ని గణనీయంగా తగ్గించుకోవడం మాత్రం సాధ్యమే. ఇందుకు ముందస్తు ప్రణాళిక, సమన్వయం, వేగవంతమైన స్పందన అత్యవసరం. ఆంధ్రప్రదేశ్‌కు తుపాన్లు కొత్తకాదు. బంగాళాఖాత తీరంలో ఉన్న రాష్ట్రం కావడంతో ఏటా ఏదోక రూపంలో ప్రకృతి విపత్తులను ఎదుర్కోవాల్సి వస్తోంది. హుద్‌హుద్, తిత్లీ, ఫణివంటి తుపాన్ల అనుభవాలు మనకు ఎన్నో పాఠాలు నేర్పాయి. అయినప్పటికీ ప్రతి విపత్తు వచ్చినప్పుడు మళ్లీ అదే సవాళ్లు ఎదురవుతున్నాయంటే వ్యవస్థాగతంగా మరింత మెరుగుదల అవసరం. తీరప్రాంత గ్రామాల్లో ముందస్తు తరలింపు ఏర్పాట్లు, పునరావాస కేంద్రాల్లో తాగునీరు, ఆహారం, వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంచడం, వృద్ధులు, చిన్నారులు, గర్భిణులు, దివ్యాంగులపై ప్రత్యేక శ్రద్ధ చూపడం ముఖ్యం. మత్స్యకారులకు సముద్రంలోకి వెళ్లవద్దన్న హెచ్చరికలు స్పష్టంగా చేరాలి. విద్యుత్, రహదారులు, తాగునీరు, సమాచార వ్యవస్థలు దెబ్బతిన్నప్పుడు తక్షణ పునరుద్ధరణకు అవసరమైన సామగ్రి, సిబ్బంది సిద్ధంగా ఉండాలి. విపత్తుల నిర్వహణలో సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత సమర్థంగా వినియోగించుకోవాలి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అందిస్తున్న 'మనమిత్ర' వాట్సాప్ గవర్నెన్స్ సేవ ద్వారా విద్యుత్ అంతరాయం, చెట్లు కూలిపోవడం, వరద నీరు చేరడం వంటి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లే అవకాశం ఉంది. అత్యవసర పరిస్థితుల్లో 112, విపత్తుల నిర్వహణ కోసం 1070, 1800-425-0101 నంబర్లను వినియోగించుకోవచ్చు.

ప్రజలు సామాజిక మాధ్యమాల్లో వచ్చే ప్రతి సమాచారాన్ని నమ్మకుండా అధికారిక హెచ్చరికలనే అనుసరించాలి. ఇక తుపాను తీరం దాటిన వెంటనే ప్రమాదం ముగిసినట్లు కాదు. భారీ వర్షాలు, వరదలు, విద్యుత్ అంతరాయాలు, రహదారులపై అడ్డంకులు మరికొంతకాలం కొనసాగవచ్చు. ఆర్నబ్ తర్వాత మురసు రూపంలో ఎదురవుతున్న ప్రకృతి సవాలు రాష్ట్రానికి ఒక హెచ్చరిక. తాత్కాలిక సహాయక చర్యలతో సరిపెట్టకుండా దీర్ఘకాలిక విపత్తు నిర్వహణ వ్యవస్థను బలోపేతం చేయాలి. తీరప్రాంత రక్షణ, డ్రైనేజీ వ్యవస్థల అభివృద్ధి, పంటల బీమా, విపత్తు నిరోధక మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలి. ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రభుత్వ యంత్రాంగం ఎంత అప్రమత్తంగా ఉంటుందో, ప్రజలు ఎంత బాధ్యతగా వ్యవహరిస్తారో కూడా నష్ట తీవ్రతను నిర్ణయిస్తాయి. ప్రస్తుతం కావాల్సింది భయాందోళనలు కాదు.. అప్రమత్తత, సమన్వయం, సమర్థవంతమైన కార్యాచరణ. ప్రజల ప్రాణాలను కాపాడటమే తొలి ప్రాధాన్యతగా యంత్రాంగం పనిచేయాలి. ■



ఖాళీ బిందె ఎప్పుడూ ఎక్కువ శబ్దం చేస్తుంది,
నిండు కుండ నిశ్శబ్దంగా ఉంటుంది.
మనుషులూ అంతే. నిజంగా సామర్థ్యం
ఉన్నవారికి తమను నిరూపించుకోవాల్సిన
తొందర ఉండదు, వారి పని మాట్లాడుతుంది.
కానీ లోపల భయం, అభద్రత ఉన్నవారు గొంతు
పెంచి, లేని ధైర్యాన్ని నటిస్తారు. ఆ అరుపులు
చూసి భయపడకండి, అవి బలం కాదు, భయం
చేసే గోల. ఎవరి వెనుక ఎంత కష్టం ఉందో
చూడండి, వారి గొంతు ఎంత పెద్దదో కాదు.

-మహాదేవ

వింతల్లో వింతలు

చేతుల మీద కాదు.. వేళ్ల మీద నడిచే చేయి!



సాధారణంగా మనుషులు చేతులతో పనులు చేస్తారు.. కాళ్లతో నడుస్తారు. కానీ స్విట్జర్లాండ్ పరిశోధకులు ఈ లెక్కనే మార్చేశారు. జ్యూరిచ్‌లోని ఈటీహెచ్ పరిశోధకులు ఐదు వేళ్లను కాళ్లుగా ఉపయోగించుకుంటూ నడిచే రోబోటిక్ చేతిని రూపొందించారు. ఏకంగా 14 రకాల ఉపరితలాలపై పాకుతూ వెళ్లగలిగే ఈ చేయి, పడిపోతే తిరిగి లేచి నిలబడటమే కాదు.. వస్తువులను నెట్టగలదు, కంప్యూటర్ కీబోర్డుపై టైప్ చేయగలదు. 'ఆడమ్స్ ఫ్యామిలీ'లోని థింగ్ గుర్తుకొస్తోంది కదూ! ఇకపై ఇంట్లో ఒంటరిగా ఉన్నప్పుడు తలుపు కింద నుంచి చేయి వస్తే.. భయపడకండి, అది రోబో కూడా కావచ్చు!

దిగ్గజ జట్లకు షాక్..

వన్డే ర్యాంకింగ్స్‌లో ఆఫ్ఘనిస్థాన్ సంచలనం


- ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో ఆరో స్థానానికి చేరిన ఆఫ్ఘనిస్థాన్
- తమ క్రికెట్ చరిత్రలోనే అత్యుత్తమ ర్యాంకును నమోదు
- శ్రీలంక, ఇంగ్లండ్, వెస్టిండీస్ వంటి జట్లను వెనక్కి నెట్టిన వైనం
- వన్డే, టీ20 ప్రపంచకప్‌లలో అద్భుత ప్రదర్శనలతో సత్తా చాటిన ఆఫ్ఘన్
- ఇటీవల ఐర్లాండ్, జింబాబ్వే సిరీస్‌లలో క్లీన్‌స్వీప్‌లతో జోరు



అంతర్జాతీయ క్రికెట్‌లో ఆఫ్ఘనిస్థాన్ తన ప్రస్థానంలో మరో చారిత్రక మైలురాయిని అందుకుంది. ఐసీసీ తాజాగా ప్రకటించిన పురుషుల వన్డే ర్యాంకింగ్స్‌లో ఆరో స్థానానికి ఎగబాకింది. మాజీ ప్రపంచ ఛాంపియన్ శ్రీలంకను వెనక్కి నెట్టి, తమ క్రికెట్ చరిత్రలోనే అత్యుత్తమ ర్యాంకును నమోదు చేసింది. ఈ ఘనతతో ఆఫ్ఘనిస్థాన్.. ఇంగ్లండ్, వెస్టిండీస్, బంగ్లాదేశ్ వంటి బలమైన జట్ల కంటే మెరుగైన స్థానంలో నిలిచింది. 2009లో అంతర్జాతీయ వన్డే క్రికెట్‌లోకి అడుగుపెట్టిన ఆఫ్ఘన్ జట్టు, అనతికాలంలోనే అద్భుతమైన ప్రగతి సాధించింది. ఇప్పటివరకు 191 వన్డేలు ఆడిన ఆ జట్టు 96 మ్యాచ్ లలో విజయం సాధించి, బలమైన జట్టుగా తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంది. ముఖ్యంగా ప్రధాన టోర్నమెంట్లలో ఆఫ్ఘన్ ప్రదర్శన ప్రపంచాన్ని ఆకట్టుకుంది. భారత్ వేదికగా జరిగిన 2023 ఐసీసీ వన్డే ప్రపంచకప్‌లో పాకిస్థాన్, శ్రీలంక వంటి జట్లపై చారిత్రక విజయాలు నమోదు చేసి సంచలనం సృష్టించింది. అలాగే, ఈ ఏడాది జరిగిన టీ20 ప్రపంచకప్‌లో తొలిసారి సెమీఫైనల్స్‌కు చేరి తమ సత్తా చాటింది. ఇటీవల కాలంలో సాధించిన వరుస విజయాలు ర్యాంకింగ్స్‌లో ఆఫ్ఘన్ స్థానాన్ని మరింత మెరుగుపరిచాయి. ఐర్లాండ్ పర్యటనలో ఆతిథ్య జట్టును 4-0 తేడాతో క్లీన్‌స్వీప్ చేసింది. ఆ తర్వాత జింబాబ్వే, బంగ్లాదేశ్‌లతో జరిగిన ట్రై-సిరీస్‌లో ఒక్క ఓటమి కూడా లేకుండా అజేయంగా నిలిచింది. వన్డేలతో పాటు టీ20 ఫార్మాట్‌లోనూ ఆఫ్ఘన్ జోరు కొనసాగుతోంది. తాజాగా షార్జాలో జింబాబ్వేతో జరిగిన మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను 3-0 తేడాతో కైవసం చేసుకుంది. చివరి మ్యాచ్‌లో జింబాబ్వేను కేవలం 79 పరుగులకే ఆలౌట్ చేసింది. ఈ మ్యాచ్‌లో లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ నూర్ అహ్మద్ 13 పరుగులిచ్చి 5 వికెట్లు పడగొట్టి కెరీర్‌లోనే అత్యుత్తమ ప్రదర్శన చేశాడు. ఈ సిరీస్‌లోని రెండో టీ20లో అజ్మతుల్లా ఒమర్జాయ్ కేవలం 50 బంతుల్లో 116 పరుగులు చేయగా, తొలి మ్యాచ్‌లో కెప్టెన్ రషీద్ ఖాన్ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో జట్టును గెలిపించాడు. ఈ వరుస విజయాలు, నిలకడైన ప్రదర్శనతో ఆఫ్ఘనిస్థాన్ ప్రపంచ క్రికెట్‌లో ఒక బలమైన జట్టుగా ఎదుగుతోంది.

స్టార్ల పక్కన ఫ్లాపులొచ్చినా ఆగని ఆఫర్లు

సినిమా ఇండస్ట్రీలో ఒకట్రెండు ఫ్లాపులు పడితేనే హీరోయిన్ల కెరీర్ ముగిసిపోయే రోజులివి. కానీ నిధి అగర్వాల్ కథ మాత్రం ఇందుకు పూర్తి భిన్నం. 'ఇస్మార్ట్ శంకర్' తర్వాత ఆ రేంజ్ బ్లాక్ బస్టర్ పడకపోయినా, ఆమె డైరీలో ఉన్న ప్రాజెక్టుల లిస్ట్ చూస్తే ఎవరైనా ఆశ్చర్యపోవాల్సిందే. భారీ చిత్రాలు చేతిలో ఉన్నప్పుడు మార్కెట్ ఊపందుకోవడం సహజం, కానీ బాక్సాఫీస్ దగ్గర ఫలితాలు తేడా కొట్టినా నిధి డిమాండ్ తగ్గకపోవడం టాలీవుడ్ లో ఒక సరికొత్త మిస్టరీలా మారింది.నిజానికి పవన్ కళ్యాణ్ 'హరిహర వీరమల్లు', ప్రభాస్ 'ది రాజా సాబ్' లాంటి భారీ ప్రాజెక్టుల్లో ఛాన్స్ దక్కడం ఏ హీరోయిన్ కైనా గోల్డెన్ ఆఫర్. కానీ బ్యాడ్ లక్ ఏంటంటే, ఏళ్ల తరబడి సాగిన ఈ భారీ ప్రాజెక్టుల షూటింగులు ఆమె కెరీర్ ప్రైమ్ టైమ్ ను తినేశాయి తప్ప ఆమె ఇమేజ్ ను నెక్ట్స్ లెవెల్ కు తీసుకెళ్లలేకపోయాయి. పైగా 'హరిహర వీరమల్లు' పూర్తయ్యే వరకు ఇతర సినిమాలు ఒప్పుకోకూడదనే కాంట్రాక్ట్ కూడా ఉండేది. 'ది రాజా సాబ్'ను సైతం నిర్మాతల అనుమతితోనే



అంగీకరించారు.ఒకవైపు అనూహ్యమైన జాప్యం, మరోవైపు రిలీజైనవి ఆశించిన గుర్తింపు ఇవ్వకపోవడంతో ఎవరైనా అయితే సైలెంట్ అయిపోయేవారు. కానీ నిధి మాత్రం వెనక్కి తగ్గకుండా కొత్త వ్యూహాలతో ముందుకెళ్తోంది. ఇక్కడే నిధి తన కెరీర్ ప్లానింగ్ ను చాలా తెలివిగా మార్చుకుంది. కేవలం టాలీవుడ్ పైనే పూర్తిగా ఆధారపడకుండా ఒకేసారి మూడు ఇండస్ట్రీలపై కన్నేసింది. బాలీవుడ్ లో ఏకంగా మూడు ప్రాజెక్టులు, కోలీవుడ్ లో మరో చిత్రం చేస్తూ నార్త్, సౌత్ రెండింటినీ కవర్ చేస్తోంది.

ఒకే చోట ఆగిపోతే కాంపిటీషన్ లో వెనకబడిపోతామనే రియాలిటీని ముందే పసిగట్టి, పక్క భాషల్లో కూడా తన ప్రెజెన్స్ ఉండేలా జాగ్రత్త పడుతోంది. తెలుగులో కూడా ఆమె ఆలోచనా తీరు మారినట్లు కనిపిస్తోంది. స్టార్ హీరోల పక్కన కేవలం రెండు పాటలు, నాలుగు సీన్లకు మాత్రమే పరిమితమయ్యే గ్లామర్ రోల్స్ ను పక్కనపెట్టేస్తోంది. సింపుల్ లవ్ స్టోరీ చేయాలనే ఆసక్తి చూపిస్తూనే, పూర్తిగా తన భుజాలపై నడిచే ఒక లేడీ ఓరియెంటెడ్ సబ్జెక్ట్ ను ఎంచుకోవడం ఆమె తీసుకున్న మంచి నిర్ణయం.

కేవలం గ్లామర్ మీదే కాకుండా నటనకు స్కోప్ ఉండే పాత్రలు చేస్తేనే లాంగ్ రన్ ఉంటుందని గ్రహించింది. ప్రస్తుతం మూడు హిందీ, రెండు తెలుగు, ఒక తమిళ చిత్రంతో మొత్తం ఆరు ప్రాజెక్టుల లైనప్ సెట్ చేసుకుంది. హిట్లు లేకపోతే కొత్త అవకాశాలు రావడం గగనమైపోయే ఈ పోటీ ప్రపంచంలో, ఈ స్థాయిలో ప్రాజెక్టులు దక్కించుకోవడం ఆమె కెరీర్ కు ఊరటనిచ్చే అంశం. కథ ఏదైనా సరే గ్లామర్ తో పాటు స్క్రీన్ మీద ఒక ఫ్రెష్ వైబ్ ఇవ్వగలదనే నమ్మకాన్ని ఈ సినిమాలతో నిలబెట్టుకోవాల్సి ఉంది.అయితే ఎన్ని ప్రాజెక్టులు చేస్తున్నామనే దానికంటే చివరకు బాక్సాఫీస్ వద్ద ఎన్ని టికెట్లు తెగాయన్నదే లెక్క. లైనప్ ఎంత స్ట్రాంగ్ గా ఉన్నా, అందులోంచి ఒకటి రెండు డీసెంట్ హిట్లు పడితేనే ఆమె పొజిషన్ కు అసలైన బలం చేకూరుతుంది. మరి రాబోయే ఈ క్రేజీ సినిమాలతో నిధి కమర్షియల్ విక్టరీ ట్రాక్ ఎక్కుతుందో లేదో చూడాలి.

అందమైన పాస్టెల్ పింక్ ఎత్నిక్ దుస్తుల్లో మెరిసిపోతున్న రుక్షార్ ధిల్లాన్



PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com